RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 81 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, సెప్టెంబర్, 13 , 2025 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 81 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, September,13 , 2025 | PAGES : 8 RS : 4 /-



## పాలస్తీనా దేశం ఏర్పాటు
# అసాధ్యం

ఢిల్లీ,: పాలస్తీనా దేశం ఏర్పాటును తాము అంగీకరించబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. ఇకపై పాలస్తీనా అనే దేశం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనకు బలం చేకూరుస్తూ, వెస్ట్ బ్యాంక్‌లోని మాలే అడుమిమ్ సెటిల్‌మెంట్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ భూభాగంలో వేలాది కొత్త గృహాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. జెరూసలేంకు తూర్పున ఉన్న ఈ ప్రాంతంలో వివాదాస్పద 'ఈ1' సెటిల్‌మెంట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై కూడా నెతన్యాహు సంతకం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనాకు ప్రత్యేక దేశంగా గుర్తింపు ఇచ్చేందుకు కొన్ని పశ్చిమ దేశాలు ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

- వెస్ట్ బ్యాంక్‌లో వేలాది కొత్త ఇళ్ల నిర్మాణానికి ఆమోదం
- వివాదాస్పద ఈ1 సెటిల్‌మెంట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఒప్పందం
- ఐరాసలో పాలస్తీనా గుర్తింపు ప్రయత్నాలకు ఎదురుదెబ్బ
- అంతర్జాతీయ చట్టాలను, మిత్రదేశాల అభ్యంతరాలను పట్టించుకోని ఇజ్రాయెల్
- ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రాజెక్టుకు... నెతన్యాహు గ్రీన్ సిగ్నల్



## ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్
# ప్రమాణ స్వీకారం

ఢిల్లీ,: భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ధన్‌ఖడ్ బహిరంగంగా కనపడడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక



## ఈ యేడాది చివర్లో
# భారత్‌కు ట్రంప్

### క్వాడ్ దేశాధినేతల సమావేశాల్లో పాల్గొనే ఛాన్స్


వాషింగ్టన్, : రష్యా చమురు కొనుగోలు కారణం చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్–అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు– చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు– భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు– తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు. 2017లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు క్వాడ్ కూటమిని ఏర్పాటు– చేశాయి. నాలుగు అగ్రదేశాలతో ఏర్పడిన కూటమి అధినేతలు 2021 సెప్టెంబరు 24న వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ– అయ్యారు. ఇక గతేడాది సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది.




## గోదావరి పుష్కరాలకు
# సన్నద్ధం కండి..

### అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, తెలంగాణ దిశ:
గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఆలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల ని, అదేవిధంగా రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో శాశ్వత ఘాట్ల నిర్మాణం చేపట్టాల ని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించా రు. ఇవాళ బంజారా హిల్స్ లోని ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గోదావరి పుష్క రాల సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలపై దేవా దాయ శాఖ అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రి కొండా సురేఖ తో పాటు ఉ న్నతాధికారులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లా డుతూ.. గోదావరి పుష్కరాలకు శాశ్వతప్రాతిప దికన ఏర్పాట్లపై కీలక సూచనలుచ చేశారు. టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ అభివృద్ధికిప్రాధాన్యత ను ఇవ్వాలన్నారు. గోదావరి పరివాహక ప్రాం తంలో ప్రముఖ ఆలయాలను మొదటి ప్రాధాన్య తగా తీసుకుని శాశ్వత ఘాట్స్ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు సీఎంరేవంత్‌రెడ్డి తీసుకోవాలన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఆలయాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అనువైన వాటిని ఎంపిక చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి పూర్తి జాబితాను సిద్ధం చేయాలని అధికారు లను ఆదేశించారు. ఆయా ఆలయాల పరిధి లో ప్రస్తుతం ఉన్న ఘాట్లను విస్తరించడంతో పాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతి పదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. పుష్కరాల సమయం లో దాదాపు 2 లక్షల మంది ఒకేసారి ఘాట్ల వద్ద స్నానమాచరిం చేందుకు వీలుగా ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.




## ఐదేళ్లు కఠిన కారాగార
# శిక్ష

### సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : దేశంలోని వర్కింగ్ జర్నలిస్టులు, పాత్రికేయులను బెదిరించినా, తిట్టినా లేదా కొట్టినా రూ. 50 వేల జరిమానా తోపాటు ఐదేళ్లు కఠిన కారాగార శిక్షకు అర్హులవుతారని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై జర్నలిస్టులు హర్షాన్ని వ్యక్తం చేశారు. తమ వృత్తిపరంగా ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా ప్రజలకు వాస్తవ సమాచారం అందించే అవకాశం ఉంటుందని పలు జర్నలిస్టు సంఘాల నేతలు తెలిపారు.

## పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట
# పనులు

హైదరాబాద్,, తెలంగాణ దిశ:
బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నార . ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం అని కమిషనర్ తెలిపారు.సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు. ఇకపోతే యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఘటనపై హైడ్రా స్పందించింది. అయితే ఘటనపై వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అన్నారు. హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు.



- ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్
- యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



# స్కాలర్ షిప్ కోసం ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్


## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా





**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** :ఎస్ సి, ఎస్ టి ఇంటర్ విద్యార్థుల డిజిటల్ కీ ఫర్ స్కాలర్ షిప్ ఆన్ లైన్ లో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అప్ డేట్ చేస్తేనే జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ వారి ఫోర్టల్ లోనికి వస్తుందని, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థుల ఎస్సీ, ఎస్టీ స్కాలర్ షిప్ ల దరఖాస్తులకు గాను డిజిటల్ కీ ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ లో ఆన్ లైన్ లో నమోదు పెండెన్సీ పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా జిల్లాలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలలాల వారీగా ప్రతి కాలేజీలో పెండింగ్ పై గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ థీమ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వారం రోజులలో పోర్టల్ లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని కాలేజీలలో ఎక్కువ శాతం పెండింగ్ ఉండడానికి కారణాలు వలస విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడమే నని ప్రిన్సిపల్స్ తెలియజేసారు. ఆన్ లైన్ లో ఇన్ అక్టివేట్ నుండి ఆక్టివేట్ చేయడంలో, డ్రా బాక్స్ కు పంపడంలో, ఎస్ఎస్ సి మెమో ప్రకారం ఆధార్ లో వివరాలు లేకపోవడం వలన కొంత జాప్యం జరుగుతుందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆన్ లైన్ లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇంతే కాకుండా మీ మీ కాలేజీలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని 80 శాతానికి తగ్గకుండా ఉత్తీర్ణత శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కాలేజీలలో అవసరమైన త్రాగునీరు, లైటింగ్, ఫ్యాన్స్, డ్రైనేజీ, వాటర్ లీకింగ్, విండోస్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క కాలేజీ ప్రిన్సిపల్స్ ను వారి వారి కాలేజీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీలో యాత్రదానంకు శ్రీకారం



**కంటోన్మెంట్, సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** :ఆర్టీసీ కంటోన్మెంట్ డిపో పరిధిలో యాత్రాదానం పేరిట నూతన కార్యక్రమం అమలకు చర్యలు చేపట్టారు. సామాజిక బాధ్యతల్లో భాగంగా తన వంతుగా ఆర్టీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అనాధలు నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాలలో సంక్షేమ హాస్టల్లో, గురుకులాల్లో చదివే పేద విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలకు పర్యటన ప్రాంతాలు పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి కోరిక ఉన్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా సాధ్యపడడం లేదు. ఇలాంటి వారి సౌకర్యార్థం ఆర్టీసీ యాత్ర దానం అనే విన్నత కార్యక్రమాన్ని ప్రారంభించింది. విరాళాల సేకరణ ద్వారా... వ్యక్తుల పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు ఇతర శుభకార్యాలు తదితర ప్రత్యేక సందర్భాల్లో ఆనందదాయకమైన రోజుల్లో అనాధలు వృద్ధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలు విహార యాత్రలకు తీసుకెళ్లడానికి ఆర్టీసీ బస్సు సదుపాయాన్ని కల్పిస్తారు. ఎన్ఆర్ఐ లతోపాటుకార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్టీసీ యాత్ర ద్వారా కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు. వారిచ్చే విరాళాలు ఆధారంగా కిలో మీటర్ల ప్రాతిపదిక ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సుల్లోకంటోన్మెంట్ డిపో నుంచి పంపిస్తారు.విరాళాలు ఇవ్వడంతో పాటు మరింతసమాచారం కొరకు నెంబర్లు995922 6143, 7382924742ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరు.

# టిఎల్ఎం మేళాతో విద్యార్థులకు బోధన సులభతరం

## - నాగేందర్ యాదవ్





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 (తెలంగాణ దిశ) :** ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాలను నేర్పించడం విద్యార్థులకు చాలా అవసరమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీయల్ఎం మేళా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్) కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుభాష్ చంద్రారెడ్డిని శాలువాతో సత్కరించి స్వాగతించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ టీయల్ఎం మేళా విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంలో బోధన-అభ్యాస పద్ధతులను మెరుగుపరచడం కోసం నిర్వహించే ఒక గొప్ప కార్యక్రమం అని అన్నారు. ఉపాధ్యాయులు సృజనాత్మకంగా రూపొందించిన బోధన వస్తువులను (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్) పాఠశాలల్లో బోధన అభ్యాస ప్రక్రియలను మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంచడం, బోధనలో కొత్త ఆలోచనలను పద్ధతులను అన్వేషించడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. మేళాలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు గమనించి విద్యార్థులందరూ సులభంగా అభ్యసించవచ్చన్నారు. మేళా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, శేరిలింగంపల్లి జెడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రరెడ్డి, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ రాములు, మాదాపూర్ ప్రధానోపాధ్యాయులు బస్వలింగం, ట్రెస్మా స్టేట్ జనరల్ సెక్రటరీ అనిల్ కుమార్, మండల్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు బల్వంత్ రెడ్డి, గోపినగర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు శివరాజ్, సురభికాలనీ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు పాండురంగారెడ్డి, సురభికాలనీ ఎంపీపీఎస్ మాజీ ఎస్ఎంసీ ఛైర్మెన్ బస్వరాజ్, ఉపాధ్యాయులు కర్ణ, దుర్గభవాని, కేశవరెడ్డి, సీ.ఆర్.పి భాగ్యమ్మ, రాములు, నరేందర్, శ్వేతా, అర్జునయ్య, యూసుఫ్, శివశంకర్, గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫాక్స్ సాగర్ మురుగునీరు డైవర్షన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** :సుభాష్ నగర్ డివిజన్ ఫాక్స్ సాగర్ లో మురుగునీరు కలవకుండా చెరువును సంరక్షిస్తూ సుమారు 2.40 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న నాలా డైవర్షన్ పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాక్స్ సాగర్ లో మురుగు నీరు కలవకుండా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న కాలనీలోని మురుగును డైవర్షన్ చేసేందుకు చేపడుతున్న పనులు దాదాపు డెబ్బై శాతం పూర్తయ్యాయని, మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసినట్లయితే చెరువు పరిరక్షణతో పాటు మత్స్య సంపద పెంపొందించడంతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని, ఆ వైపుగా అధికారులు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రామారావు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఫెరోజ్, దుర్గా రావు, ఇస్మాయిల్, కుంట సిద్ధిరాములు, కమలాకర్, తోకల నగేష్ రెడ్డి, మధు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ్ ఏచూరి దేశం గర్వించదగిన మహానాయకుడు

## - చందానగర్ వర్ధంతి సభలో వక్తలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** :భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీ అఖిల భారత మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి వర్ధంతి పురస్కరించుకుని శేరిలింగంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చందానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి సి. శోభన్ మాట్లాడుతూ దేశం గర్వించ దగ్గ మహా నాయకుడు కామ్రేడ్ సీతారామ్ ఏచూరి అని అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాలు చేస్తూ కమ్యూనిస్టు పార్టీ లో అగ్రశ్రేణి నాయకత్వ స్థాయికి చేరుకుని జీవితాంతం ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. ఆయన మేధో శక్తి పార్టీతో పాటు దేశ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందని గుర్తు చేశారు. ఏచూరి చతురతకు ప్రతిపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం ఆశ్చర్యపోయేవారని, బహుభాషా కోవిధుడైన ఏచూరీని కోల్పోవడడం భాదాకరమన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకిత భావాన్ని గుర్తు చేశారు. మతతత్వ పాలనకు వ్యతిరేకంగా దేశం లో ఒక ప్రత్యామ్నాయ కూటమికి రూప కల్పన చేయటంలో ఆయన పాత్ర అమోఘమని అన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, మత ఛాందస పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడం ఆయన ఆశయ సాధనకు కృషి చేసినట్టు అవుతుందని శోభన్ గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఏచూరి స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమం లో జోన్ నాయకులు వి. మాణిక్యం, కె.కృష్ణ, వి.మల్లికార్జున్, సయ్యద్ ముజామిల్, అశోక్, సాయిలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో " విజయ హైస్కూల్ " విద్యార్థుల విజయం





**కాప్రా, సెప్టెంబర్ 12, తెలంగాణ దిశ)** :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 69వ జోనల్ టోర్నమెంట్ లో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో కాప్రా విజయ హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. అండర్ 14 విభాగంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు డివైన్ గ్రేస్ హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర కబడ్డీ జట్టు ప్రత్యర్థి జట్టును ఖంగు తినిపించి విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఉద్దమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా సెక్రటరీ మనోహర్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. అండర్ 14 వాలీబాల్ పోటీల్లో బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. గెలుపొందిన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను విజయ హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్ అభినందించారు. గెలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొప్పునూరి వీణ, హెడ్ మిస్ట్రెస్ మిస్సెస్ వి. పద్మావతి, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు చదువుతోపాటు సంస్కారం నేర్పించాలి

## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ గారు



**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** : సూరారంలోని వీబీపీ ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ రికగ్నైజ్డ్ అఫర్డబుల్ ప్రైవేట్ స్కూల్స్ (టీఆర్ఏపీఎస్ఏ) అసోసియేషన్ అధ్వర్యంలో టీచర్స్ డే సందర్భంగా "ప్రేరణ పురస్కార్" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యా బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 120 మంది ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్ని చదువుతో పాటు సంస్కార వంతంగా తీర్చిదిద్దడంలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, హేమలత సురేష్ రెడ్డి, టీఆర్ఏపీఎస్ఏ చైర్మన్ వెంకటేష్, ప్రెసిడెంట్ వినోద్ జాదవ్, కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, ముఖ్య సలహాదారులు ప్రవీణ్ రెడ్డి, నర్సింహులు, రాష్ట్ర, జిల్లా ట్రస్మ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ ఎస్ సి బస్తీలో శరవేగంగా డ్రైనేజీ మరమ్మతుల పనులు





**మల్లాపూర్, సెప్టెంబర్ 12, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ లోని ఓల్డ్ మల్లాపూర్ లో ఇటీవల నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో వెలువడిన సమస్యల్లో ఎస్ సి బస్తీలో చాల రోజుల నుండి ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్య తీరనుంది. గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ఉప్పల్ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో అధికారుల సహకారంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అనిల్ కుమార్ శుక్రవారం పనులను పర్యవేక్షించారు. అధికారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ సి సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సలహాదారులు పీజీ. సుదర్శన్, కాంగ్రెస్ మల్లాపూర్ సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, కోయలకొండ రాజేష్, కె.శివ,బస్తీ వాసులు యెడల గణేష్, రఘు, ప్రసాద్, సురేష్, నవీన్, హరి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇక డాలర్ టైమ్ అయిపోయిందా

బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఈ కూటమి కూడా తొందర్లోనే అంతమవుతుందని ట్రంప్ అన్నారు. బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయని, అందుకే తాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో తెలిపారు. అయితే, ఈ సందర్భంగా ట్రంప్ ఏ దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. బ్రిక్స్ కూటమిలో కీలక దేశాలైన భారత్, రష్యా, చైనా తమ మధ్య త్రైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. అంతకుముందు కూడా బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు. భారత్, చైనా మధ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు రష్యా ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం చైనా దీనికి సానుకూలంగా స్పందిస్తోంది. చైనా, రష్యా, భారత్ మధ్య త్రైపాక్షిక సంబంధాలు కేవలం మూడు దేశాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా.. ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతిని, భద్రతను, స్థిరత్వాన్ని, అభివృద్ధిని అందించేందుకు సాయం చేస్తుందని చైనా విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. త్రైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి రష్యా, భారత్‌లతో చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా ఉందని లిన్ అన్నారు. రష్యా-భారత్-చైనా (ఆర్ఐసీ) ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత్, చైనాతో రష్యా చర్చలు జరుపుతోందని అంతకుముందు ఆ దేశ డిప్యూటీ ఫారిన్ మినిస్టర్ ఆండ్రీ రుడెంకో చెప్పారు. బ్రిక్స్ విషయం ప్రస్తావించిన ట్రంప్.. " బ్రిక్స్ అని పిలిచే ఒక చిన్న గ్రూప్ త్వరలోనే అంతం కాబోతుంది. డాలర్‌ను, డాలర్ ఆధిపత్యాన్ని, ప్రమాణాలను ఇది చేజిక్కించుకునేందుకు చూసింది" అన్నారు. "బ్రిక్స్ గ్రూప్‌లోని అన్ని దేశాలపై మేం 10 శాతం సుంకాలను విధించనున్నామని చెప్పాను. ఆ తర్వాత రోజే వారు సమావేశం నిర్వహించారు. కానీ, ఎవరూ హాజరుకాలేదు" అని ట్రంప్ వెటకారంగా అన్నారు. ఆ తర్వాత ట్రంప్ మరోసారి డాలర్‌ను బలోపేతం చేయాలని, ప్రపంచ కరెన్సీగా దాన్ని ఉంచాలని నొక్కి చెప్పారు. "మేం డాలర్‌ను పడిపోనీయం. ప్రపంచ కరెన్సీగా డాలర్ తన హోదాను కోల్పోతే, అది ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన మాదిరే అవుతుంది" అని తెలిపారు. 'బ్రిక్స్ దేశాల కూటమి గురించి విన్నప్పుడు, నేను వారిపై కఠిన వైఖరిని అనుసరించాను. ఒకవేళ ఈ దేశాలు ఏకమైతే, త్వరలోనే ఈ గ్రూప్ అంతమవుతుంది" అని అన్నారు. ఈ ఏడాది జులై 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో బ్రిక్స్ 17వ సదస్సు జరిగింది. ఈ సదస్సు తర్వాత కూడా అదనంగా 10 శాతం సుంకాలను విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు. 'బ్రిక్స్‌కు చెందిన ఏ దేశమైనా అమెరికా వ్యతిరేక విధానాలతో ఉంటే అదనంగా 10 శాతం సుంకాలను ఎదుర్కోవాలి. ఈ సుంకాల విధింపులో ఎలాంటి మినహాయింపు ఇవ్వం" అని జులై 7న ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ రాశారు. ప్రపంచ పాలనను మెరుగుపర్చడం', 'అంతర్జాతీయ సుస్థిరత'పై బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లో చర్చించారు. దీంతో పాటు ఏకపక్ష సుంకాలు, సుంకాలు లేకపోవడంపైనా చర్చ జరిగింది. ఈ డిక్లరేషన్ మేనిఫెస్టోలో అమెరికా పేరును ప్రస్తావించలేదు. వాణిజ్య విధానాలను వక్రీకరించి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను ఉల్లంఘించే ఏకపక్ష సుంకాలు, నాన్-టారిఫ్ చర్యల వినియోగంపై బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయని రియో డిక్లరేషన్ పేర్కొంది. ఏకపక్ష బలవంతపు చర్యలు విధించడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం కిందకే వస్తుందని ఈ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు పేర్కొన్నాయి. ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు వంటివి ప్రపంచంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని తెలిపాయి. ఈ బ్రిక్స్ సదస్సులో డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా వాణిజ్యాన్ని సమర్థిస్తూ, బహుళ పక్ష వాణిజ్య విధానం గురించి చర్చించినట్లు తెలిపింది. 2020లో భారత్, చైనా దేశాలకు చెందిన సైనికుల మధ్య ఘర్షణ నెలకొనడంతో, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత ఆర్ఐసీ కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఆర్ఐసీ ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని జులై 17న భారత మీడియాలో కథనాలు వచ్చాయి. మూడు దేశాలకు అనువైన విధానంలోనే ఏదైనా నిర్ణయం తీసుకుంటారని ఆ కథనాలు పేర్కొన్నాయి. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)లో పాల్గొనేందుకు ఐదేళ్లలో తొలిసారి భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చైనాకు వెళ్లిన సందర్భంగా.. ఆర్ఐసీ ఫార్మాట్‌పై చర్చలు జరిగాయి. ఏకపక్షం, రక్షణవాదం, అధికార రాజకీయం, బెదిరింపులు ప్రపంచానికి తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి" అని జులై 14న జైశంకర్‌తో భేటీ అయిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ లీ చెప్పారు. అందుకే, రెండు దేశాలు సామరస్యంగా జీవించేందుకు, ఒకదానికొకటి సాయపడుతూ విజయం సాధించే మార్గాలను అన్వేషించాలని అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశాలు భారత్, చైనాలు. ఈ రెండు దేశాలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధించే అదనపు సుంకాల ముప్పు ముంగిట ఉన్నాయి. సుంకాలు విధిస్తామని 50 రోజుల్లో యుక్రెయిన్‌తో యుద్ధం ముగించేలా ఒప్పందానికి రావడానికి రష్యాపై ఒత్తిడి తీసుకు రానుంది అమెరికా. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్-అమెరికా మధ్య సంబంధాలు క్షీణించాయని చైనా నిపుణులు అంటున్నారు. చైనీస్ న్యూస్ అవుట్‌లెట్ గ్వాంచాలో జులై 13న రాసిన కథనంలో.. అమెరికా, భారత్ మధ్య కొనసాగుతోన్న వాణిజ్య సంక్షోభాన్ని ఫుడాన్ యూనివర్సిటీకి చెందిన ఝి చావో ప్రస్తావించారు. భారత్‌ను కట్టడి చేసేందుకు పాకిస్తాన్‌ను వాడుకోవడం, రెండు దేశాల మధ్య బలవంతంగా సయోధ్యను కుదర్చడం వంటి వ్యూహాన్ని అమెరికా అవలంభించిందని ఆయన అన్నారు. చైనాకు చెందిన ఇంటర్నేషనల్ స్కాలర్ ప్రొఫెసర్ జిన్ కాన్‌రాంగ్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు క్షీణిస్తుండటంతో.. అమెరికా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. జూన్‌లో కెనడాలో జరిగిన జీ-7 సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవలేకపోయారని ప్రొఫెసర్ జిన్ అన్నారు. ఆ తర్వాత పాకిస్తానీ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చిన తర్వాత భారత్ మరింత అసంతృప్తి వ్యక్తం చేసింది. చైనా, రష్యాతో అమెరికా సంబంధాలు ఉద్రిక్తతంగా మారాయి. యుక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత చైనా, రష్యాలు మరింత దగ్గరయ్యాయి. అమెరికా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని తిరస్కరించి, బహుళ ధ్రువ ప్రపంచాన్ని అంటే పలు దేశాల మధ్య అధికారాన్ని పంపిణీ చేసే వ్యవస్థను సృష్టించాలని ఈ రెండు దేశాలు చర్చిస్తున్నాయి. అందుకే ప్రపంచంలో అమెరికా కరెన్సీ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు రెండు దేశాలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి. అమెరికా డాలర్‌తో కాకుండా చైనా కరెన్సీ యువాన్‌తో ఆసియా, ఆఫ్రికా, దక్షిణా అమెరికా దేశాలతో వాణిజ్యం చేయాలనుకుంటున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2023లో చెప్పారు. చైనా ఇప్పటికే రష్యాతో తన కరెన్సీ యువాన్‌తో ట్రేడ్ చేస్తోంది. రష్యా కూడా అదే చేస్తోంది. ఎందుకంటే, అమెరికా, పశ్చిమ దేశాలు రష్యాపై తీవ్ర ఆర్థిక ఆంక్షలు విధించాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, వీటి మిత్ర దేశాలు చాలా అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థ స్విఫ్ట్ నుంచి రష్యన్ బ్యాంకులను నిషేధించాయి. "బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ కరెన్సీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఒకవేళ ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించలేకపోతే, కనీసం ఫైనాన్సియల్ నెట్‌వర్క్‌నైనా సృష్టించాలని అనుకుంటున్నాయి" అని విదేశీ వ్యవహారాల నిపుణులు, 'ది ఇమేజ్ ఇండియా ఇనిస్టిట్యూట్' అధ్యక్షుడు రబీంద్ర సచ్‌దేవ్ చెప్పారు. "స్విఫ్ట్ బ్యాంకింగ్ ఇంటర్నేషనల్ అమెరికా, యూరప్, పశ్చిమ దేశాలఆధిపత్యంలో ఉంది. ఏదైనా దేశంపై ఆంక్షలు విధిస్తే, ఈ వ్యవస్థ నుంచి అది వైదొలుగుతుంది" అని రబీంద్ర చెప్పారు.' రష్యాపై విధించిన ఆంక్షలను చూస్తే, భవిష్యత్‌లో తమ బ్యాంకింగ్‌ను కూడా బ్లాక్ చేస్తాయేమోనని బ్రిక్స్ దేశాలు భయపడుతున్నాయి.



# గ్యాంగ్ ఉమెన్

తిరుపతికి వెళ్లే దారిలో రేణిగుంట రైల్వేస్టేషనుకు సమీపాన రైల్వే గ్యాంగ్ కార్మికులుగా ఈ ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు. వీరు ప్రతిరోజూ కాలి నడకన, ట్రాక్ వెంబడి 10 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తూ ట్రాక్ మరమ్మతులు చేస్తున్నారు. గ్రీజు పూయడం, డెబ్రీలను శుభ్రపర్చడం, ట్రాక్ పనితీరుని సరిచూడడం, పాములు, తేళ్లు, ఇతర విషసర్పాలు ఏవైనా ట్రాక్‌లో చిక్కుకుని ఉంటే వాటిని వెళ్లగొట్టడం వీరి దినచర్య. దొంగల భయంతో పురుషులు కూడా ఒంటరిగా ప్రయాణించలేని ప్రమాదకర పరిస్థితుల్లో ఈ మహిళలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు.

యాభై ఏడేళ్ల జి చంద్రమ్మ 1993 నుండి రైల్వే ట్రాక్ మెయింటైనర్ బాధ్యతల్లో ఉన్నారు. తన ఉద్యోగ ధర్మం గురించి ఆమె ఇలా చెబుతున్నారు. 'నేను ఉద్యోగంలో చేరేనాటికి నా భర్త చనిపోయాడు. ఏ విద్యార్హత లేని నన్ను తాత్కాలిక ఉద్యోగిగా మాత్రమే తీసుకున్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయినా వెనుదిరిగి చూడలేదు. వృత్తిపరంగా మొదట్లో నాకు ఏ నైపుణ్యాలు లేవు. కానీ అనుభవమే అన్నీ నేర్పింది. 30 ఏళ్లుగా పురుషుల మధ్య పనిచేస్తున్నాను. చాలా ఏళ్లపాటు ఈ ఉద్యోగంలోకి మహిళలు రాలేదు' అని కాస్తంత విచారవదనంతో ఆమె చెబుతోంది. విధి నిర్వహణలో చంద్రమ్మ చూపిన అంకితభావానికి గాను ఐదేళ్ల క్రితం ఉత్తమ విధులు నిర్వర్తించిన గ్యాంగ్‌గా చంద్రమ్మకి గుంతకల్ డిఆర్ఎం అవార్డు ప్రకటించింది.

ఆర్ నందిని 2016 నుండి ఇక్కడ ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తోంది. 'నాన్న రిటైర్డ్ అయిన తరువాత నాకు ఈ ఉద్యోగం వచ్చింది. బిఎ పూర్తిచేసిన నేను టీచర్‌గా పనిచేయాలనుకున్నాను. కానీ కుటుంబ బాధ్యతలు నన్ను ఈ పనిలోకి వెళ్లేలా చేశాయి. తల్లిదండ్రులను, చెల్లి, తమ్ముడి బాధ్యతలు చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. మొన్నీమధ్యే చెల్లి పెళ్లి చేశాను. తమ్ముడి పెళ్లి త్వరలో చేయాలి' అంటున్న నందిని అవివాహిత. ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు విధుల్లో ఉంటుంది. 'మేము పురుషులతో సమానంగా పనిచేస్తున్నాం. అధికారులు అప్పచెప్పిన పనిని సకాలంలో, సమర్థవంతంగా పూర్తిచేయడం మా కర్తవ్యం. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా బెదరకుండా మా పని మేం చేస్తాం' అంటూ తన విధినిర్వహణలను నందిని వివరించారు.

జ్యోతి కుమారి రామ్ పశ్చిమబెంగాల్ నుండి వచ్చారు. 2023 నుండి ఇక్కడి ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తున్నారు. 'నేను పశ్చిమబెంగాల్ కంచర్ పడా గ్రామం నుండి వచ్చాను.

ఆరు నెలలకు ఒకసారి ఇంటికి వెళతాను. ఇది చాలా కష్టంగా ఉంటుంది. ఆర్మీలో చేరాలని కలలుకన్నాను. కానీ కుటుంబ పరిస్థితులు ఇక్కడికి వచ్చేలా చేశాయి. ఇష్టం లేని పనే అయినా అప్పగించిన బాధ్యతలు ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా చదువుకుంటున్నాను. ఎందుకంటే నా వృత్తి, ప్రవృత్తి రెండూ నాకు ముఖ్యమే' అంటోంది. చంద్రమ్మ, నందిని, జ్యోతి లాంటి మహిళలు మనచుట్టూ ఎంతోమంది. ప్రమాదకర పరిస్థితులను సైతం లెక్కచేయకుండా అంకితభావంతో పనిచేస్తున్న ఆ మహిళలందరిని మనసారా అభినందిద్దాం.



# గుత్తా రాజకీయ ప్రేమలేఖలు



నల్గొండ, తెలంగాణ దిశనల్లగొండ జిల్లా రాజకీయాల్లో గుత్తా సుఖేందర్‌రెడ్డి ముద్ర. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో గుత్తా సుఖేందర్ రెడ్డి సీనియర్ నేతగా ఉన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన గుత్తా సుఖేందర్ రెడ్డి.. రాజకీయాల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. మూడుసార్లు ఎంపీగా, రెండోసారి శాసనమండలి సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆయన రాజ్యాంగ బద్ధమైన శాసనమండలి చైర్మన్ గా కొనసాగుతున్నారు. నిత్యం ప్రజాజీవితంలో ఉండేందుకే ఇష్టపడే సుఖేందర్ రెడ్డి.. ముక్కుసూటిగా వ్యవహరిస్తారని పేరుంది. పార్టీల కతీతంగా వివాదారహితుడిగా గుత్తాను నేతలు, కార్యకర్తలు అభిమానిస్తారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ ఆయన ప్రజా సమస్యలపై స్పందిస్తుంటారు. అవసరమైన సందర్భాల్లో రాజకీయ వ్యాఖ్యలు చేయడంతోపాటు ప్రభుత్వానికి లేఖాస్త్రాలు సంధిస్తున్నారట. ప్రజాపాలనలో ప్రభుత్వం విమర్శలు పాలుకావొద్దని పలు సమావేశాల్లో గుత్తా పరోక్ష హెచ్చరికలు చేశారట. తన రాజకీయ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలతో సుతిమెత్తని చురకలంటిస్తున్నారట. ఇరిగేషన్ ప్రాజెక్టుల రివ్యూ సమావేశాల్లోకీలక వ్యాఖ్యలు. ఉమ్మడి జిల్లా ఇరిగేష న్ ప్రాజెక్టుల మీద పట్టున్న గుత్తా.. ఇరిగేషన్ ప్రాజెక్టుల రివ్యూ సమావేశాల్లో .. కీలక వ్యాఖ్యలు చేశారట. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు పుట్టంగండి నుండి సాగునీటిని విడుదల చేయాలని ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. దానికి కౌంటర్ గా తనదైన శైలిలో స్పందించిన గుత్తా పుట్టంగండి పంపుహౌజ్ వద్ద ఐదో మోటారు అమర్చేందుకు రూ.148కోట్లు తక్షణమే మంజూరు చేయాలని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఎంఎమ్ఆర్‌పీ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ లైనింగ్ పనుల విషయంలో కూడా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇదేరకంగా స్పందించారట. రూ.400కోట్లు లైనింగ్ పనులకు శాంక్షన్ చేశామని మంత్రి ఉత్తమ్ చెప్పినప్పుడు కూడా కేవలం లైనింగ్ మాత్రమే సరిపోదని, కాలువ వెడల్పు కూడా పెంచా లని దానికి తగ్గట్టుగా డిజైన్ చేయాలని సూచించారట. అంతేకాదు ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ఆలస్యం చేస్తోందని, దాని వల్ల కేడర్?లో అసంతృప్తి పెరిగిపోయే ప్రమాదం ఉందని గతంలో గుత్తా హాట్? కామెంట్స్ చేశారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి గుత్తా సుఖేందర్ లేఖ. తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా గుత్తా సుఖేందర్ లేఖ రాశారు. రాష్ట్రంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో చేసిన పనులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించ లేదు. స్కూల్ బిల్డింగ్ ల నిర్మాణం కోసం అప్పటి కాంట్రాక్టర్లు, స్కూల్ మేనేజ్మెంట్ .. ఎస్ఎంసీ కమిటీలు అప్పుల పాలయ్యాయరని తక్షణమే రూ.361.350కోట్లు చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. మన ఊరు మన బడి బిల్లులు చెల్లించాలని పలువురు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సీఎం రేవంత్ కు లేఖ రాయడం వెనక అంతర్యమేమై ఉంటుందని జిల్లాలో చర్చ జరుగుతోందట. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒరవడిని సృష్టించుకున్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఏ విషయంలో కూడా రాజీపడటంలేదంట. గుత్తా బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయట. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు భూసేకరణ విషయంలో గుత్తా చొరవతోనే రైతులను ఒప్పించగలిగారట. కొడుకు గుత్తా అమిత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసమా? ఉపాధి హామీ నిధుల పంచాయితీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కౌంటర్‌గా జిల్లా కలెక్టర్ కు గుత్తా నోటీసులు ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వం తరపున జరిగే ప్రతి కార్యక్రమానికి, జిల్లా మంత్రుల రివ్యూ మీటింగ్‌లలో పాల్గొంటున్న గుత్తా ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పరోక్ష చురకలు అంటిస్తూ, విమర్శలు చేస్తున్నారట. తనయుడు గుత్తా అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేయడానికి పెద్దాయన పావులు కదుపుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతోది. ఇప్పటికే ఆయన కుమారుడు అమిత్ రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. అమిత్‌రెడ్డి పొలిటికల్ ఫ్యూచర్ కోసమే గుత్తా.. రాజకీయ వ్యాఖ్యలతో, ప్రభుత్వానికి లేఖాస్త్రాలతో జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారట. మొత్తానికి ఆయన పొలిటికల్ ప్రేమలేఖల వెనక ఆంతర్యం ఏంటని పొలిటికల్ సర్కిల్స్ చర్చించుకుంటున్నారట. మరికొందరు మాత్రం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ గుత్తా సుఖేందర్ రెడ్డి లేఖాస్త్రాలతో సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారనీ జిల్లాలో టాక్. మరి సీనియర్‌మోస్ట్ లీడర్ అయిన గుత్తా వ్యూహాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి

# టార్గెట్ కమ్మ సామాజిక వర్గం!

**గుంటూరు, తెలంగాణ దిశ** ఏపీలో రాజకీయాలు అంటేనే సామాజిక సమీకరణలపై ఆధారపడి ఉంటాయి. ఇక్కడ సామాజిక వర్గాలు రాజకీయాలను శాసిస్తుంటాయి. ఫలానా కులం ఫలానా పార్టీ అని చాలా సులువుగా చెప్పవచ్చు. కమ్మ సామాజిక వర్గం అయితే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. కాపులంటే జనసేన.. ఇలా రకరకాలుగా విశ్లేషించుకోవచ్చు. అయితే ఒక రాజకీయ పార్టీకి బలమైన మద్దతుదారులుగా సామాజిక వర్గాలు ఉంటాయి. ఇవి సహజం కూడా. అయితే కొన్ని సామాజిక వర్గాలు కొన్ని పార్టీలను విపరీతంగా ద్వేషిస్తుంటాయి. 2019లో రెడ్డి సామాజిక వర్గం టిడిపిని ద్వేషించింది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కమ్మ సామాజిక వర్గం ద్వేషించింది. అయితే రాజకీయ పార్టీలకు సామాజిక వర్గాల మద్దతు మాట అటుంచితే.. శత్రువులుగా మారిపోవడం ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే పార్టీలు ఇప్పుడు సామాజిక వర్గాల వ్యతిరేకి అనే ముద్ర పోగొట్టుకునేందుకు ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి. ఈ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలంగా పనిచేసింది కమ్మ సామాజిక వర్గం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం వ్యక్తులు ఏకతాటిపైకి వచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. దీనికి కారణం లేకపోలేదు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గం ఒక రకమైన దాడి జరిగింది. వారి ఆర్థిక మూలాలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సామాజిక వర్గానికి చెందిన వారి పరిశ్రమలను వెళ్ళగొట్టారు.

వీటన్నింటికీ తోడు చంద్రబాబును జైలులో పెట్టి ఇబ్బంది పెట్టారన్న కసితో కమ్మ సామాజిక వర్గం ఒకే తాటి పైకి వచ్చింది. అయితే 2019లో రెడ్డి సామాజిక వర్గం చేసిన ఫైట్.. 2024 ఎన్నికల్లో కనిపించలేదు. అది జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది.

వాస్తవానికి ఏ సామాజిక వర్గాన్ని దూరం చేసుకోవాలని వ్యూహం ఉండదు ఏ రాజకీయ పార్టీకి. అందుకే జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన కొడాలి నానికి మంత్రి పదవి ఇచ్చారు. కానీ విస్తరణలో భాగంగా తీసేసారు. వల్లభనేని వంశీ మోహన్ లాంటి నేతలు వైసీపీలోకి ఫిరాయించారు. కరణం బలరాం వంటి సీనియర్ను ప్రలోభ పెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.

దేవినేని అవినాష్ వంటి నేతకు ప్రోత్సహించారు. అయితే అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం మూలాలపై దెబ్బ తగలడంతో వారు వీటిని పరిగణలోకి తీసుకోలేదు. ఒకరిద్దరు నాయకుల తప్ప కమ్మ సామాజిక వర్గాన్ని తొక్కేసారన్న ఆరోపణలను మూటగట్టుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డికి దీని పర్యవసానాలు తెలిసాయి. అందుకే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. వల్లభనేని వంశీని పరామర్శించడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చాలామందికి నచ్చలేదు. కొంతమంది సీనియర్లకు కూడా ఇది మింగుడు పడలేదు. గత ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి వల్లభనేని వంశీ లాంటి నేతలు కారణం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడంతో పాటు కమ్మ సామాజిక వర్గానికి అండగా నిలిచారన్న అంశం ముఖ్యం. దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి వల్లభనేని వంశీని పరామర్శించారు. అటు తన వెంట కొడాలి నానితో పాటు దేవినేని అవినాష్ ను పెట్టుకున్నారు. చంద్రబాబు, తన కుమారుడు ఎదగాలన్న కోణంలోనే ఆలోచిస్తున్నారని.. కమ్మ సామాజిక వర్గంలో ఇతర నేతల ఎదుగుదల వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇదంతా కమ్మ సామాజిక వర్గం మద్దతు కోసమేనని ప్రచారం నడుస్తోంది. మద్దతు తెలపక పోయినా పర్వాలేదు కానీ.. కమ్మ సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని శత్రువుగా చూడకుండా చేయాలన్నదే జగన్ ప్లాన్ గా తెలుస్తోంది. మరి ఆ ప్రయత్నం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# పీహెచ్‌సీ, అంగన్‌వాడీల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు..




## మీ పిల్లలకు వెంటనే ఆధార్ అప్డే చేసుకోండి!

**హైదరాబాద్,, తెలంగాణ దిశ**ఆధార్ ఇప్పుడు అందరికీ తప్పనిసరిగా మారింది. పెద్దవాళ్లకే కాదు.. చిన్న పిల్లలకు కూడా ఆధార్ అవసరమే. ఆధార్ కార్డు లేకపోతే స్కూళ్లలో అడ్మిషన్ల కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై సరైన అవగాహన లేక పిల్లలను పాఠశాలలో చేర్పించే సమయంలో తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. బడి ప్రారంభ సమయంలో ఆధార్ సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అలా అందరూ ఒకే సమయంలో రావడంతో ఆధార్ సేవా కేంద్రాలు రద్దీగా మారుతున్నాయి. అప్పుడు ఆధార్ కార్డుల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రభుత్వం.. పుట్టిన చోటే శిశువులకు ఆధార్ కార్డులు జారీ చేసేలా చొరవ తీసుకుంది. ఏపీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కొంతకాలంగా ప్రత్యేకంగా శిశు ఆధార్ సేవా కేంద్రాలను నిర్వహిస్తోంది. ప్రతి నెలా 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ ఆధార్ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటాయి. ఇవి ఉచిత సేవలు అందిస్తాయి. పిల్లల బర్త్ సర్టిఫికెట్, తల్లి లేదా తండ్రి ఆధార్, బయోమెట్రిక్ వివరాలను సమర్పించడం ద్వారా ఈ కేంద్రాల్లో పిల్లలకు ఆధార్ కార్డు తీసుకోవచ్చు. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో ఏపీలో 11 లక్షల మంది చిన్నారులకు ఆధార్ లేనట్లు తెలిసింది. అలాగే ఆధార్ నమోదు చేసుకున్న వారిలోనూ 42.10 లక్షల మంది బయోమెట్రిక్ చేయించుకోలేదని వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే పీహెచ్‌సీలు, అంగన్‌వాడీలు, గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ప్రత్యేక శిశు ఆధార్ నమోదు కేంద్రాలను ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇక స్కూళ్లలోనే ఆధార్ కార్డు అప్‌గ్రేడేషన్: ఐదేళ్లు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలా ఐదేళ్ల వయసు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ చేయించుకోని చిన్నారులు దేశవ్యాప్తంగా ఏడు కోట్ల మందికిపైగా ఉన్నట్లు యూఐడీఏఐ తాజాగా వెల్లడించింది. అలాంటి వారికోసం యూఐడీఏఐ కొత్త వెసులుబాటు తీసుకొస్తోంది. పిల్లలు చదువుకునే స్కూళ్లలోనే ఆధార్ అప్‌డేషన్ చేసే విధంగా ఒక ప్రాజెక్టును ప్రారంభించినట్లు ఇటీవల యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి జిల్లాకు బయోమెట్రిక్ మెషిన్లను పంపించి, ప్రతి పాఠశాలలో ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి స్కూల్‌కు వెళ్లి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షిస్తున్నామని.. మరో 45 నుంచి 60 రోజుల్లో ఇది సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

పిల్లలకు ఆధార్ కార్డు ఎలా అప్లై చేయాలి: యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్‌లోని మై ఆధార్ విభాగంలోకి వెళ్లాలి. అందులో బుక్ మై అపాయింట్‌మెంట్ ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత మన సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాలను ఎంచుకుని అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ చేసుకున్న టైమ్‌లో తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లాల్సి ఉంటుంది. అక్కడ పిల్లల బర్త్ సర్టిఫికెట్‌తో పాటు తల్లి లేదా తండ్రి ఆధార్, బయోమెట్రిక్ వివరాలను నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌తో తెలియకపోతే నేరుగా సమీపంలోని ఆధార్ కేంద్రాలకు నేరుగా వెళ్లి సంబంధిత ఆధార్ ఫామ్ పూర్తి చేసి అవసరమైన డాక్యుమెంట్లు ఇస్తే సరిపోతుంది. ఐదేళ్ల లోపు పిల్లలు అయితే నీలిరంగు ఆధార్ (బాల ఆధార్) ఇస్తారు. దీనికి పిల్లల బయోమెట్రిక్ వివరాలు తీసుకోరు. కానీ ఐదేళ్ల తర్వాత మాత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు సమర్పించి ఆధార్ కార్డు అప్‌గ్రేడ్ చేయించుకోవాల్సి ఉంటుంది.

## ఫుడ్ డెలివరీ ఏజెంట్ల దుస్తుల్లో వచ్చి బంగారం దుకాణంలో చోరీ..



ఘజియాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఫుడ్ డెలివరీఏజెంట్లదుస్తుల్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ బంగారం దుకాణం పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డయ్యాయి. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో బ్లింకిట్, స్విగ్గీకి చెందిన డెలివరీ ఏజెంట్ల దుస్తుల్లో హెల్మెట్లు ధరించిన వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్థానికంగా ఉన్న మాన్సి జ్యువెలర్స్‌లోకి చొరబడ్డారు. అక్కడ సిబ్బందిని బెదిరించి.. దుకాణంలోని డిస్‌ప్లేలో ఉన్న ఆభరణాలను దోచుకున్నారు. వాటన్నిం టినీ తమ బ్యాగుల్లోకి నింపుకుని అక్కడ నుంచి ఉడా యించారు. దుకాణం నుంచిదాదాపు 20కిలోల వెండి, 125 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లినట్లు దుకాణం యజమాని తెలిపారు. ఐదారు నిమిషాల్లోనే మొత్తం ఊడ్చుకెళ్లినట్లు పేర్కొన్నారు. తాను పోలీసులకు ఫోన్ చేసినట్లు చెప్పారు. 15-20 నిమిషాల్లో పోలీసులు వచ్చారని.. అయితే అప్పటికే దొంగలు పారిపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# మీ ఇంట్లో మీ పిల్లలకు ఇలాంటి భోజనం పెడతారా ?



పాముదుర్తి (అనంతపురం) : పాముదుర్తి ప్రాథమిక హై స్కూల్ లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం పై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పాముదుర్తి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా లేదని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనం మీ ఇంట్లో ఉన్న పిల్లలకు పెడతారా ? అని మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల పైన అక్కడున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల పై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. పాముదుర్తి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చాలా రోజుల నుంచి సక్రమంగా లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ పాఠశాలలో విజిట్ చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే కూరల్లో పప్పు చాలా నీళ్లగా ఉందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట నరసమ్మ ను మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులు గిరిప్రసాద్‌ను పిలిచి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని లేదంటే మధ్యాహ్నం ఏజెన్సీని రద్దుచేసి మరొకరికి అప్పగిస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే ఆహారం సక్రమంగా ఉందా లేదా అనే విషయాన్ని కనీసం పర్యవేక్షణ చేయడం లేదని పాఠశాల హెచ్‌ఎం ను ప్రశ్నించారు. పాఠశాలలో చదివే పేద విద్యార్థులందరూ మన మన పిల్లలే అని మన ఇంట్లో ఏ విధంగా మంచి ఆహారాన్ని తీసుకుంటాము ఆ విధంగా పాఠశాలలో కూడా నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలకు మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు.

# జిపివో, సర్వేయర్ల పరీక్ష



## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ** ఈ నెల నిర్వహించనున్న గ్రామ పరిపాల న అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెవ తేదిన జరుగనున్న గ్రామ.పరిపాలన అధికారి, లైసెన్సుడ్ పరీక్షలు నిర్వహణ పై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతి రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని, 38 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.అలాగే లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్ష జిల్లా కేంద్రంలోని జివిటిసి కేంద్రంలో వ్రాత, ప్రాక్టీకల్ పరీక్షలు అదే రోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్య ర్థులు చివరి నిమిషం వరకు వేచియుండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష నిర్వహణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ భద్రత నడుమ తరలించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్, సింగరేణి అధికారులకు సూచించారు. మంచినీరు సరఫరా చేయాలని,మున్సిపల్, పంచాయతి అధికారులు పరీక్షా కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సిబ్బంది, పరీక్ష వ్రాసేఅభ్యర్థులకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని, నిశిత పరిశీలన తదుపరి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనింతించాలని తెలిపారు. తనిఖీ చేసే అధికారులు పరీక్షా కేంద్రా ల్లోకి సెల్ ఫోన్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటెల్‌లో మాస్ లేఆఫ్.. ఈసారి 24,000 మంది తొలగింపు




టెక్ దిగ్గజం ఇంటెల్ భారీ మాస్ లేఆఫ్‌కు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 24,000 మంది ఉద్యోగులను తొలగించడానికి కంపెనీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సంఖ్య కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో 22-25 శాతానికి సమానం కావడం గమనార్హం. దీనివల్ల 2024 చివరి నాటికి కంపెనీలో 99,500 మంది వరకు ఉద్యోగులు 75 వేలకు తగ్గనున్నారు. ప్రధానంగా ఈ తొలగింపులు కృత్రిమ మేధ(ఏఐ) వైపు దృష్టి సారించడంతో పాటు పెద్ద మొత్తం ఖర్చు తగ్గించే పునర్నిర్మాణంలో భాగంగా జరగనున్నట్టు కంపెనీ సీఈఓ లి-బూ టాన్ తెలిపారు. ఉద్యోగుల సంఖ్యను తగ్గించ డమే కాకుండా కంపెనీ తన కీలక జర్మనీ, పోలండ్ లాంటి చోట్ల చేపట్టిన విస్తరణలను కూడారద్దు చేసింది.తగినంత డిమాండ్ లేకుం డానే ఫ్యాక్టరీ సామర్థ్యం పెంచాలని కంపెనీ భావించిందని ఆయన అభిప్రాయపడ్డారు. కాబట్టి భారత్‌లోని ఉద్యోగులపైనా ఈ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా కోస్టా రికా నుంచి అసెంబ్లీ, టెస్టింగ్ కార్యకలాపాలను వియత్నాం, మలేషియాలకు మారుస్తోంది. తద్వారా 2 వేల మందికి పైగా కోస్టా రికా ఉద్యోగులు ఇతర బాధ్యతల కు మారనున్నారు. అలాగే, ఒహియో సెమీకండక్టర్ ప్లాంట్ నిర్మాణాన్ని కూడా కంపెనీ ఆలస్యం చేస్తోంది. ఇటీవల 2025 రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ ఆదాయం క్షీణించడం కూడా తాజా పరిణామాలకు కారణం కావొచ్చని తెలుస్తోంది. దీనివల్ల పెట్టుబడిదారుల విశ్వాసం సన్నగిల్లేందుకు కారణమవుతోంది. కాగా, ఇప్పటికే మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ లాంటి టెక్ కంపెనీలు లక్షకు పైగా ఉద్యోగులను తొలగించాయి. ఇప్పుడు ఆ జాబితాలో ఇంటెల్ కూడా చేరింది.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లనిస్తాం

**- ఇండ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దు..**
**- అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు..**
**- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే**
**- ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం..**



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ** ఇందిరమ్మ ఇండ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే భాద్యత నాది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాక గ్రామ రైతు వేదికలో జిల్లా హౌసింగ్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా చిన్నకోడెపాక, బాలయ్యపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి, గాంధీనగర్, కొత్తపల్లి(కే), వెంకటేశ్వర్లపల్లి, చెంచుపల్లి గ్రామాల్లోని మొత్తం 79 మంది లబ్దిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వ పదేళ్ళ పాలనలో స్మశాన వాటికలు, వైకుంఠదామాలు కడితే ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్ళలోనే కూలిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన కొనసా గుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పుడు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే చెప్పారు. అదేవిధంగా, రాష్ట్రాన్ని గత పదేళ్లు పాలించినోళ్లు ఒక్క రేషన్ కార్డూ ఇవ్వకపోగా, పేదలను నిరుపేదలుగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వంకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆరోపించారు. పేదలకు కూడా సన్నబియ్యం అందించాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడాలేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కాని, ఒక్క కిలో సన్న బియ్యం కాని ఇవ్వలేదన్నారు.

**శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయి..:**
శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఈరోజు బాలయ్యపల్లి గ్రామంలో పోలీసు శాఖ వారి ప్రోత్సాహంతో గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తొట్ల తిరుపతి యాదవ్ సహకారంతో గ్రామంలో రూ.1 లక్షా 20 వేల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అంతేకాకుండా, గ్రామాల్లో ఎటువంటి నేరాలు, దొంగతనాలు జరగకుండా, ఏదైనా నేరం జరిగితే దోషులను, నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, దుకాణాల్లో, కాలనీల్లో ఇండ్ల వద్ద ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# శ్రద్ధతో నేర్చుకోండి.. స్వశక్తితో ఎదగండి

**రామవరం, తెలంగాణ దిశ** మహిళలు స్వశక్తితో స్వావలంబన సాధించి ఎదగాలనే ఆకాంక్షతో సింగరేణి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాలతో తేనె టీగల పెంపకం కార్యక్రమాన్ని ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు తెలిపారు. ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ఆర్ సి ఓ ఏ క్లబ్‌లో తేనె టీగల పెంపకంపై శిక్షణ తీసుకుంటున్న మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో జీకేఓసి, వీకేఓసి ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాల మహిళలకు కార్పొరేట్ సామాజిక బాధ్యతో తేనె టీగల పెంపకంపై మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, అగర్తల, వెస్ట్ త్రిపుర చెందినవారు ఉచిత శిక్షణతో పాటుగా సంబంధిత పరికరాలను ఇచ్చి స్వయం ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 120 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, శిక్షణ అనంతరం తేనె టీగల పెంపకానికి సంబంధించిన పరికరాలను కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. శ్రద్ధతో నేర్చుకుని తేనె టీగల పెంపకం చేపడితే నెలకు ఒక్క బాక్స్ ద్వారా సుమారు రూ.6 వేల సంపాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె.గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.రజాక్, కొత్తగూడెం ఏరియా ఎస్ ఓ టు జి ఎం. జి.వి. కోటిరెడ్డి, ఏజీఎం ఎఫ్ అండ్ ఎ కె.హనా సుమలత, డీజీఎం (పర్సనల్) జి.వి.మోహన్ రావు, డివై పిఎం జి.హరీశ్, రాజ్వాలియా మాలిక్, మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ (ట్రైనర్), జిఎం కార్యాలయం ఫిట్ సెక్రెటరీ సాగర్, మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.



# నిబంధనల ప్రకారం విధులు పకడ్బందీగా నిర్వహించాలి



**పెద్దపల్లి, తెలంగాణ దిశ:** జిల్లాలో అధికారులు నిబంధనల ప్రకారం విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హై కోర్టు కేసులు, ఆర్.టి.ఐ. దరఖా స్తులు, ప్రజావాణి, ప్రజా దర్బార్ దరఖాస్తుల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ్ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కోర్టు కేసులను సరిగ్గా ఫాలో కాకపోవడం వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నాయని, ప్రతి శాఖ తమ పరిధిలో కోర్టు కేసులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని, సరైన కౌంటర్ సకాలంలో ఫైల్ చేయాలని, మన దగ్గరి నుంచి కేసు సంబం ధించిన డాక్యుమెంట్స్ ఫైల్ చేయాలని అన్నారు. స మాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులకు నిబంధనల ప్రకారం సమాధానం సకాలంలో పంపాలని, ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ ఉండవద్దని అన్నారు. దిశ సమావేశం సంబంధించిన మీటింగ్ పై తీసుకున్న చర్యలు రిపోర్ట్ రేపటి వరకు డి. ఆర్.డి.ఓ కార్యాలయానికి సమర్పిం చాలని కలెక్టర్ తెలిపారు. ప్రోటోకాల్ సంబంధించి చెక్ లిస్ట్ ప్రతి శాఖ పంపాలని అన్నారు. ప్రతి నెలా జిల్లా అధికారులు తమ టూర్ డైరీ వివరాలు, ఓవరాల్ యాక్టివిటీ కలెక్టరేట్ హెచ్ విభాగానికి సమర్పించాలని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శాఖపరమైన లక్ష్యాలు, వాటి సాధనకు తయారు చేసుకున్న ప్రణాళికలు రిపోర్ట్ అందించాలని అన్నారు. ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్ పద్ధతులలో సిబ్బంది నియామకం సంబంధించి ప్రతి అంశాన్ని కలెక్టరేట్ దృష్టికి తప్పనిసరిగా తీసుకొని రావాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సజావుగా నియామకం జరిగేలా చూడాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎక్కడా కూడా అవినీతి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏఐ టూల్స్ వాడుతూ మన కార్యాల య విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.

# అప్పులు చేసిన వారికి శిక్షలు లేవా ?

గత పాలకుల ధోరణి కారణంగా ..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పులకుప్పగా మారింది. విభజన వల్ల జరిగిందిదే. రెండు కుటుంబాలు బాగు పడ్డాయి. రాష్ట్రాలు మాత్రం నీరసించాయి. ఈ అప్పులకు వడ్డీలు కట్టలేక మళ్లీ మళ్లీ అప్పులు చేస్తున్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పిన కెసిఆర్, జగన్ ఇద్దరూ రాష్ట్రాల ను దివాళా తీయించారు. దీనికి కేంద్రంలోని బిజెపి కూడా ఓ కారణం. అప్పులకుప్పగా రాష్ట్రాలు మారుతున్నా చోద్యం చూసిన మోడీ ప్రభుత్వం..ఇప్పుడు నీతి వాక్యాలు పలుకుతోంది. తెలంగాణలో అయితే బిజెపి నేతలకు వేరే పనేమి లేనట్లుగా విమర్శలతో కాలయాపన చేస్తున్నారు. కేంద్రంలో అంతా బ్రహ్మాండంగా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం గడిపేస్తున్నారు. అప్పులు చేయకుండా రాష్ట్రాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇలా పాలకులు ఇష్టానుసారం అప్పులు చేసి వెళితే దాని బాధ్యత ఎవరిదన్న చర్చ చేయాలి. జీతాలు సకాలంలో ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేసామనుకుంటున్న కెసిఆర్, జగన్‌లు కళ్లు తెరిపించాలి. అసవరమైతే అందుకు వారిని బాధ్యతులను చేయాలి. చేసిన అప్పులకు శిక్షలు పడేలా చేయాలి. ఇకముందు రాజకీయ పార్టీలు, నేతలు ఇలా బాధ్యతా రహితంగా వ్యవహరించకుండా కట్టడి చేయాలి. ఇప్పటికైనా పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని పాలకులు గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే పద్దతులు ఇకనుంచి పోవాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇకపోతే వీరు చేసిన అప్పులకు తోడు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు పద్దతి మార్చుకోవడం లేదు. వడ్డీలు కట్టలేక పోతున్నామని ఇద్దరు సిఎంలు అంటున్నారే తప్ప ఖర్చులు తగ్గించుకోవడం లేదు. ఏ రకంగా ఆదాయం పెంచుదామా, ఎలా ప్రజల నడ్డి విరుద్దామా అన్న ఆలోచనలే తప్ప..దుబారా పథకాలకు కళ్లెం వేయడం లేదు. సన్నబియ్యం అంటే కిలో రూపాయి బియ్యం, పెన్షన్లలో బోగస్ లబ్దిదారులను ఏరివేసే కార్యక్రమం చేయడం లేదు. ఇకపోతే విభజన వల్ల రెండు తెలుగు రాష్ట్రాలను కోలుకోకుండా చేసిన ఘనత కెసిఆర్, జగన్‌లకే దక్కుతుంది. ఈ ఇద్దరి కారణంగా విభజన లక్ష్యం వెనక్కి పోయింది. ఇద్దరూ గోబెల్స్‌ను మించి అభివృద్ధి పేరుతో అతిగా ప్రచారం చేశారు. ఇప్పుడేమో వాటిని మరచిపోయేలా ప్రజల్లో మళ్లీ సానుభూతి పొందేలా ఎదురుదాడి విమర్శలకు దిగుతున్నారు. సిగ్గూ ఎగ్గూ లేకుండా చేస్తున్న విమర్శలు చూస్తే మతిపోతుంది. ఇటు కెటిఆర్, హరీష్ రావు, కవితలు, అటు జగన్ ఆయన పరివారం అబద్దాల మూటలతో ప్రజలను వంచించే పనిలో పడ్డారు. ఎపిలో కనీసం 14.70 లక్షల కోట్లు అప్పుపెట్టి పోయారు జగన్ మహాశయులు. తెలంగాణలో కూడా ఏడులక్షల కోట్లను అప్పుగా పెట్టి పోయారు కెసిఆర్. ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా పాలన సాగించారు. అప్పులనుచి ఇప్పటి కిప్పుడు బయటపడడం సాధ్యం కాదు. రైతుభరోసా విషయంలో ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రభుత్వం సరైన అడుగులు వేస్తోంది. అర్హులకే ఇవ్వడంతో పాటు, గతంలో అప్పనంగా రైతుబంధు సాయం పొందిన వారి జాబితాను సిద్దం చేస్తోంది. దాదాపు 25వేల కోట్లు వృధా అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి దుబారాకు సంబంధించి నిక్కచ్చిగా వ్యవహరిం చాల్సిందే. ఎందుకంటే ఆస్తుల మాట ఎలా ఉన్నా ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. కొత్త కొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పులు చేసామని తెలుగు వల్లభులు కెసిఆర్, జగన్‌లు చాటుకున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేసారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెట్టారు. కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నా.. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబులకు పట్టడం లేదు. ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి..ఎంతమంది పేదలు ఉన్నారు..ఎంతమంది కిలో బియ్యం వాడుతు న్నారన్నది గమనించడం లేదు. బియ్యం పక్కదారి పట్టి అమ్ముకుంటున్నా పట్టించుకోవడం లేదు. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఉచిత విద్యుత్ కూడా ఇప్పుడు ఆందోళనలకు కారణం అవుతోంది. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయాలి. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్న ప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం వేరన్న పద్దతిలో పాలన సాగాలి. రైతుభరోసా కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రం.. ప్రజలే అని గుర్తించాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర సిఎంలు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగించిన ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు, ఉచిత గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల ద్వారా లక్షల కోట్లు దుర్వినియోగం అయ్యాయి. విపక్షాలు కూడా విమర్శలు మాని ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టడానికి సహకరించాలి. మంచి సూచనలు ఇవ్వాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యులు కాగలరు. ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్కగట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగు పడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరిపాలన అందించిన వారం అవుతాం.ప్రజలకునేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించక పోవడం సరికాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు. బొక్కసం వెక్కిరించేలా చేయడం వల్ల..అప్పులు చేయడం వల్ల భవిష్యత్ తరానికి కోలుకోలేని దెబ్బ తగలగదని గుర్తించాలి.

# గిరిజన ప్రజలకు ఆధార్ కార్డులివ్వండి

**గ్రామాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలి**

**సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి**

**భద్రాద్రి కొత్తగూడెం, తెలంగాణ దిశ:** మణుగూరు, అందరికీ ఆధార్ ఓ వరమని, ఆధార్ కార్డ్ తో అన్ని ప్రభుత్వ అందుకోవచ్చని, కానీ మండలంలో ని మారుమూ ల గిరిజనులకు మాత్రం అది ఇంకా ఓ శాపంగా మారిందని ,సామాజిక కార్యకర్త, న్యాయ వాది కర్నె రవి అన్నారు. ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధా ర్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ ఆయన తహసిల్దార్ అద్దంకి నరేష్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా రవి మాట్లాడుతూ.. మండలం లో మారుమూల ఆది వాసి గ్రా మాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బు డుగుల, పెద్దిపల్లి, ఇప్పల గుంపు గ్రామాలకు చెందిన గుత్తి కోయ ప్రజల పిల్లలకు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, లేకపోవడంతో చదువుకు, ఇతర ప్రభుత్వ పథకాలకు ఇప్పటి వరకు దూరంగా ఉన్నారని తెలి పారు. ఓవైపు ఆయా గ్రామాల్లో అధికంగా నిరక్షరాస్యులు ఉన్నా రని, దీంతో వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక నేటి వరకు ఆధార్ కార్డులనుప్రజలు పొందలేదన్నారు.ప్రభుత్వ సంక్షే మపథకాలు పొందాలంటే తప్ప నిసరిగా ఆధార్ కార్డు అవసర మని, మొదటిగా జనన ధ్రువీ కరణ పత్రం అవసరమని, ధ్రువీ కరణ పత్రం లేకపోవడం తో వారికీ ఇప్పటివరకు ఆధార్ కా ర్డులు మంజూరు కాలేదన్నా రు.విద్యార్థులను స్కూల్‌లో వేయాలంటే ఆధార్ తప్పనిసరి, రేషన్ కార్డ్ కావాలంటే ఆధార్ ఉండాలి, అనుకోని



ప్రమాదం జరిగితే ఆరోగ్యశ్రీ కింద చికిత్సకి కూడా ఆధారే కీలకం. కానీ ఆధా ర్ గురించి, పథకాల గురించి సరైన అవగాహన లేక గిరిజ నులు వీటన్నిటికీ దూరమైపోయారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రా లలోబర్త్ సర్టిఫికెట్ తో సంబంధం లేకుండా, కుటుంబ వివరాలను నమోదు చేసుకొని మండల స్థాయి అధికా రులు సమన్వయంతో వందశాతం గిరిజనులకు ఆధార్ కార్డులను అందించేందుకు చర్యలు తీసు కోవాలని కోరారు.

# నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు..!

**కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య**

**జమ్మికుంట, తెలంగాణ దిశ:**జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామం మాజీ సర్పంచ్, బోయిని సమ్మయ్య, రోజున జమ్మికుంటలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..! గత కొంతకాలంగా గ్రామంలో రాజకీయంగా నేనంటే గిట్టని కొంతమంది కలిసి, నేను భూమి కబ్జా చేశానని తప్పుగా ఆరోపణలు చేశారని. ఈ క్రమములో కోరపల్లిలో జమ్మికుంట మండ లం తాసిల్దార్ ఆధ్వర్యంలో జరిగిన భూభారతి కార్యక్రమంలో బ్యానర్ పట్టుకొని నాపై ఆరోపణలు చేశారని .కానీ దొంగే,, దొంగ దొంగ అని అన్నట్లుగా బ్యానర్ ప్రదర్శించిన వాళ్లే భూ కబ్జాలకు పాల్పడ్డారని వారి అన్ని వివరాలు తేదీ 14/ 7/ 2025 సోమవారం నాడు ప్రజావాణి లో కలెక్టర్ కు ఇవ్వడం జరిగిందన్నారు. మండల్ తాసిల్దార్ కార్యాలయం నుండి సమాచార హక్కు చట్టం ప్రకారం వాళ్ల కబ్జాల భాగవతం తీయడం జరిగింది అని తెలిపారు. అలాగే పాస్టర్ అనిల్ కుమార్ ఇతను మా గ్రామానికి ఆరు సంవత్సరాల క్రితం రావడం జరిగిందన్నారు. కానీ 20 సంవత్సరాల క్రితమే తనకి నారాయణరావు వ్రాసినట్టుగా అతను మాట్లాడుతున్నాడని, కానీ నారాయణరావు రైటింగ్ అందరికీ తెలుసు అని, ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. 969 / %ఎ%,5 గుంటల భూమి రాయించుకొని 968 / %ఖ% మా యొక్క తల్లి భూమి లోనికి వస్తూ అమాయకులైన కొంత మందిని వెంట వేసుకొని రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తూ రాజకీయంగా నాకు గిట్టని వాల్ల తో చేతులు కలిపి నా మీద ఆరోపణ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే గిరవెన శ్రీనివాస్ వీళ్ళకి తోడుగా ఇతను కూడా,,పాడి లీలాదేవి భూమి నేను నాతో పాటు కొంతమంది యాదవులు కొనుగోలు చేస్తే దానిని కూడా 12 ఎకరాల 13 గుంటలు ఒక తప్పుడు ఆర్ వో ఆర్ సర్టిఫికెట్ సృష్టించుకుని తాహసిల్దార్ భాస్కరరావు, ఇచ్చినట్టుగా ఫేక్ సర్టిఫికెట్ సృష్టించడం జరిగిందని అన్నారు. తాహసిల్దార్ భాస్కరరావు, 2011/ 6వ నెలలో జమ్మికుంట నుండి బదిలీపై వెళ్లగా భాస్కరరావు 9 వ నెలలో అక్రమంగా రెవెన్యూ రికార్డులో భూమి ఎక్కించుకొని నాదే అనుకుంటూ అధికారుల చుట్టూ తిరుగుకుంటూ నా మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఈ సందర్భంగా వివరించారు. అతనే స్వయంగా సివిల్ కేస్ కోర్టులో వేసిన దాంట్లో 40 ఎకరాల కబ్జాకు పాడి లీలాదేవి యొక్క భూమి వాళ్ల తండ్రి పేరు మీద వన్ బి లో ఎమ్మార్వో ఆఫీస్ లో భద్రంగా ఉన్న వన్ బీలో 12 ఎకరాల 11 గుంటలు ఎక్కించడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ రికార్డులో టాంపరింగ్ కు పాల్పడ్డట్టుగా తెలిపారు. ఇతనితో పాటు పింగిలి రాకేష్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఫిషరీష్ చైర్మన్ అని చెప్పుకుంటూ మా ఊరి గోపాల్ రెడ్డి తల్లి పింగిలి నరసమ్మ పేరు గల భూమిని 971 లో 18 గుంటల భూమి వీళ్ళ తాత పేరు పింగిలి అని ఉన్నందుకు పింగిలి నరసయ్యగా ఉంటే పింగిలి నరసమ్మను, పింగిలి నరసయ్యగా దిద్దుకొని ఆ 18 గుంటలు మాది అని ఆ రికార్డులో మార్పు చేసుకొని వాళ్ళ తండ్రి పేరు మీద అట్టి భూమిని విలాసతూ చేసుకున్నారని అన్నారు. వారిదేమో రెడ్డి కులం, ఈ పింగిని రాకేష్ ది తెనుగు కులం, పింగిలి రాకేష్ అనే వ్యక్తి చీటింగ్ చేసుకుంటూ,ప్రభుత్వం పేరు చెప్పుకొని దౌర్జన్యాలకు దిగుతూ ఇతనే నామీద ఫేస్బుక్లో గాని, సోషల్ మీడియాలో గాని,అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మా ఊరి కోరపల్లి మాజీ సర్పంచ్ కందికట్ల మధుసూదన్,అనే వ్యక్తి పింగిలి వెంకటేశ్వర్ రెడ్డి ద్వారా 889 సర్వేనెంబర్ లో 5 ఎకరాల 14 గుంటల భూమిని వాళ్ల భార్య కందికట్ల సంధ్యారాణి, పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని అన్నారు. కానీ వెంకటేశ్వర రెడ్డి కి,,నేను తీసుకున్న సమాచార హక్కు చట్టం పాహనీ లో పట్టా గాని లేదు. కావాలని వెంకటేశ్వర రెడ్డినీ మభ్యపెట్టి అతని పేరుపై చేసుకొని రెవెన్యూ అధికారులను కూడా మభ్యపెట్టి అతను దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలిపారు. గత 15 సంవత్సరాలుగా తన మీదికి రాకుండా కొంతమంది పోలీసు వారి దగ్గరికి వెళ్లి తప్పుడు సమాచారం ఇచ్చి, గత సంవత్సరము గొడవ పెట్టి అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు. దీని అంతటికి కారణం కందికట్ల మధుసూదన్ , డిసి శ్రీనివాస్, ఫాస్టర్, లు వీరందరూ నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కోరపల్లి గ్రామంలో బహిరంగంగా చర్చకు నేను సిద్ధమని తెలిపారు. వీళ్ళందరూ ఒక గ్రూపుగా ఏర్పడి వీళ్ళే తప్పుడుగా రెవెన్యూ రికార్డులను మార్చి, భూ కబ్జాలకు పాల్పడి తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి ఈ భూములు కబ్జా చేసిందే కాకుండా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నాపై పబ్లిక్ లో సోషల్ డ్యామేజ్ చేస్తున్నారని వారిపై పరువు నష్ట ధావా వేసానని వారికి నోటీసులు కూడా ముట్టినాయని.వారిని త్వరలో కోర్టుకు కూడా ఇడుస్తానని ఈ సందర్భంగా బోయిని సమ్మయ్య, పేర్కొన్నారు...

# కేసులు మీద కేసులు..!

**తిరుపతి, తెలంగాణ దిశ:** ప్రభుత్వ అండదండలతో రెచ్చిపోతారా?! విచ్చలవి డిగా కేసులు పెడతారా?! మీరు మాపై కేసు మీద కేసు రాస్తే? మేం తప్పక ఇస్తాం రివర్స్ డోసు అంటున్నారు వైసీపీ నేతలు. చట్టబద్ధంకాని కేసులను చట్టబద్ధంగానే తేల్చుకుంటామంటూ సవాల్ చేస్తున్నారు. ప్రైవేట్ కేసులు వేసి ఓవైపు ప్రభుత్వం, మరోవైపు అధికారుల పని పడతామంటున్నారు?! అసలింతకీ ఈ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? వాటి ఇంపాక్ట్ ఎలా ఉంటుంది?? ఇదే అంశం ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.మాజీ సీఎం జగన్ వరుస పర్యటనలపై రాజకీయ రచ్చ ఏరేంజ్‌లో అయితే నడుస్తోందో? కేసులు కూడా అదే స్థాయిలో నమోదవుతున్నాయి?! అంతకుముందు గుంటూ రు, మొన్నామధ్య పల్నాడు, లేటెస్ట్‌గా బంగారుపాళ్యం పర్యటన పైనాకేసులు ఫైల్ అవ్వడం చర్చనీయాంశమైంది. జగన్ పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిం చడంతోపాటు పూర్తిగా ఆంక్షలు ఉల్లంఘిస్తున్నారంటూ కేసులు మీద కేసులు నమోదవుతున్నాయి. వైసీపీ కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు ఫైల్ అయ్యాయి. అంతేకాదు పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో సింగయ్యను జగన్ కారు ఢీకొట్టిందంటూ జగన్‌పైనా కేసు నమోదవ్వడంపై భగ్గుమన్న వైసీపీ నేతలు రివర్స్ ఎటాక్‌కి రెడీ అయిపోయారు. సంబంధం లేని వాళ్లందరిపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు? తప్పు ఎవరిదైనా తమ నేతలపైనే కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహిస్తున్నారు. అలాంటి వాటికి వైసీపీలో భయపడే వాళ్లు ఎవరూ లేరంటూనే? ప్రైవేట్ కేసులతో ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారుల పని పడతామంటున్నారు. ఇక కాస్కోండి అంటూ సవాల్ విసురుతున్నారు. తమపై కక్ష కట్టిన ఏ ఒక్కరిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.వైసీపీ నేతల మాటలతో అసలీ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? అవి వేస్తే ఏమవుతుందన్న అంశంపై చర్చ మొదలైంది. ప్రైవేటు కేసు వేయడం అంటే? ఒక వ్యక్తి నేరుగా కోర్టులో దాఖలు చేసే ఫిర్యాదు. సాధారణంగా, పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నిరాకరించినప్పుడు లేదా ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు బాధితులు నేరుగా కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత ఫిర్యాదు చేసిన వ్యక్తి మేజిస్ట్రేట్ ముందు హాజరై తన ఇబ్బందులేంటో చెప్పాల్సి ఉంటుంది. ప్రభుత్వాధికారులు ఎందుకు కేసు ఫైల్ చేయలేదో క్లారిటీ కూడా ఇవ్వాలి. ఇక ఇరువర్గాల వాదనల అనంతరం కోర్టు తీర్పునిస్తుంది. అయితే పక్కా ఆధారాలు, తమవైపు ఎలాంటి తప్పులేదనుకున్నప్పుడు మాత్రమే ఈ ప్రైవేట్ కేసులు వేయడానికి సిద్ధమవుతారు. ఇప్పుడు వైసీపీ నేతలు కూడా మేం సిద్ధమంటున్నారు. వైసీపీ నేతలు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వారికి చట్టబద్ధంగానే శిక్ష పడేలా చేస్తామంటున్నారు. మరీ వైసీపీ అన్నట్లుగానే ప్రైవేట్ కేసులు వేస్తుందా?? లేక మాటలతోనే సరిపెడుతుందా?? అన్నది తేలాంటే కాస్త ఆగాల్సిందే.

# గీత కార్మికుల ప్రమాదాల నివారణకు రక్షక కవచాలు

**కమాన్ పూర్, తెలంగాణ దిశ:**ఈత కార్మికుల ప్రమాదాల నివారణకు ప్రభుత్వం రక్షణ కవచాలను అందజేస్తుందని ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించి, తదనంతరం కిట్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికులు చెట్లు ఎక్కే క్రమంలో, దిగే క్రమంలో ప్రమాదాలు జరగకుండా, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ కవచం కిట్ ఉపయోగకరంగా ఉంటుందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రఘు, రాజు, శ్రావణ్, గీత ట్రైనర్లు జాగిరి అంజి గౌడ్, పొన్నం వెంకటేష్ గౌడ్,కాట రవీందర్ గౌడ్,బత్తిని శ్రీనివాస్ గౌడ్, గోలి వాడ గౌడ సంఘం అధ్యక్షులు కోల అంతర్గాం, వివిధ గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకుందాం



గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేధం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (దాన్ని నరేగా అని కూడా పిలుస్తున్నారు) పార్లమెంటులో ఆమోదించబడి చట్టంగా తయారైంది. మొట్టమొదటి యుపిఏ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందించబడింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఉపాధి చట్టానికి తూట్లు పొడవడం మొదలు పెట్టి దాని స్ఫూర్తిని నాశనం చేయడానికి చర్యలు చేపట్టింది. పార్లమెంటులో తయారైన శాసనానికి ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయడం ద్వారా.. చట్టం స్ఫూర్తినేకాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా ఆ పార్టీ దాడి చేయడం ప్రారంభించింది.

ఉపాధిపై బిజెపి దాడి: అధికారంలోనికి వచ్చిన నాటి నుండి బిజెపి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నది.

మొదటిది: మొట్టమొదట పథకం ప్రవేశ పెట్టినపుడు కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం నిధులు అంటే 2.5 లక్షల కోట్లు కేటాయించగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 1.37 శాతం (రూ.86 వేల కోట్లు) మాత్రమే కేటాయించింది. అంతేకాక గతేడాది కేటాయింపుల కంటే ఈ సంవత్సరపు కేటాయింపులు పెరగకపోగా కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను కూడా ఈ పథకానికి వినియోగించడంలో పూర్తిగా విఫలమైంది. చట్టం ప్రకారం రకరకాల కారణాలచేత కనీసం వంద పని దినాలు కల్పించడంలో విఫలమవుతుండగా బడ్జెట్ కేటాయింపులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సగటున కల్పించిన పని దినాలు 50.23 కాగా గత ఆర్థిక సంవత్సరం ముందు అది 52.8 గా ఉంది. అంటే రానురానూ బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదనడంలో సందేహం లేదు.

రెండవది: నమోదైన కూలీల పేర్లు అర్ధాంతరంగా తొలగించడం. గత సంవత్సరానికి ముందు ఉపాధి పథకానికి 25.2 కోట్ల మంది నమోదు కాగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ తర్వాత ఆ సంఖ్య 18.28 కోట్లకు తగ్గింది. అంతమందినే ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించింది. బిజెపి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి ఈ పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క గ్రామీణ భారతంలో కొన్నేళ్లుగా నిరుద్యోగం, ఉపాధి లేమి పెరుగుతుండగా ఉపాధి కల్పించే జాబు కార్డుల తొలగింపు కూడా పని దినాల తగ్గింపుకు దారితీసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం 389.09 కోట్ల పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 286.26 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది.

మూడవది: ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో దళిత ఆదివాసీల అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచే పని బాగా ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పరిస్థితుల్లో కొంతమేరకు వృద్ధి కనబడింది. కాగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములపై కాక పట్టణ ప్రాంత భూముల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో 65 శాతం నిధులు వ్యవసాయ లేదా దాని అనుబంధ కార్యకలాపాలకు వినియోగించితే నేడు అది 46.74 శాతానికి పడిపోయింది. మరొక ముఖ్యమైన డిమాండ్ ఉపాధి వ్యవసాయ పనులను అనుసంధానించడం. ఉపాధి పనులను పెంచడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం గ్రామీణ నిరుపేద రైతు కూలీలను భూస్వాముల ధనికుల భూముల్లో పని చేయమని బలవంతం చేస్తున్నది. తద్వారా గ్రామీణ ధనవంతులతో రైతు కూలీల బేరసారాల శక్తి తగ్గిపోయింది పనిదినాల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఉపాధి చట్టానికి మరిన్ని తూట్లు పొడుస్తూ బిజెపి సర్కార్ రాష్ట్రాలకున్న నిర్ణయాత్మక శక్తి లేకుండా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే పని దినాల కేటాయింపుకు తెగబడింది.

నాలుగవది: ఉపాధి హామీ చట్టం అమలులో రైతు కూలీలకు పని దినాలు తగ్గే విధంగా యంత్ర సాంకేతికతను ప్రోత్సహించడం, సామాగ్రి విడి భాగాల కొనుగోలు ఖర్చును ఈ నిధుల నుండే ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ప్రవేశపెట్టిన కొత్తలో కేవలం పది శాతం మాత్రమే వస్తువులు విడిభాగాలకు కేటాయించారు. మిగిలిన నిధులు రైతు కూలీల జీతాలు చెల్లింపులకు వినియోగించారు కానీ నేడు అది 36 శాతానికి పెరిగింది. యంత్రాల వాడకం కూడా పెరిగింది. పర్యవసానంగా రైతు కూలీల బదులు యంత్రాలు సాంకేతికత వినియోగం పెరిగి పని దినాలు పడిపోయాయి.

ఐదవది: ఈమధ్య ఉపాధి రైతు కూలీలకు రెండు నుండి ఏడు శాతం వేతనం మాత్రమే పెంచడం కేవలం వారిని స్పష్టంగా ఈ పనులకు దూరంగా ఉంచడమే. వారి శ్రమ దోపిడీకి పాల్పడడమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 300 నుండి 307కు పెరగగా బీహార్‌లో 245 నుండి 255కు కేరళలో 346 నుండి 349కి వారి వేతనాలు పెరిగాయి. ఈ రకమైన పెంపు చేసినప్పుడు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని జీవన వ్యయాన్ని గమనంలోనికి తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఉపాధి చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జీతాన్ని కేంద్రం కూడా అమలు పరచాలి. కేరళ ప్రభుత్వం 800 రూపాయలు నిర్ణయించగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది చాలా తక్కువగా ఉండటం శోచనీయం.

నిధులు ఇవ్వకుండా నీరుగార్చే కుట్ర: ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి. ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది. ఇది కేవలం పంచాయతీల్లోని గ్రామాలకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇది చట్టాన్ని నీరుగార్చే కుట్రలో మరో భాగం. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోయిందనే సాకుతో గత మూడేళ్లుగా ఆ రాష్ట్రానికి కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయడం లేదు. నిధులు ఆపి గ్రామీణ కూలీలను ఇబ్బంది పెట్టిన కేంద్రం తీరును ఇటీవల కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఉపాధి గ్రామీణ ప్రజల హక్కు అని తేల్చిచెబుతూ 2025 ఆగష్టు ఒకటినుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది.

సంఘటిత ఉద్యమాలే శరణ్యం: ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం మూడు డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు అత్యంత నిరుపేదలు. ఉపాధి హామీ చట్టం అమలు కారణంగా గ్రామీణ పేదలు అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందడంతో అత్యంత నిరుపేదల లిస్టు నుండి వారు బయటపడ్డారు. కానీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రావడంతో తిరిగి వారు మళ్ళీ పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారు. కేంద్రం విధానాల వల్ల నేటి గ్రామీణ భారతంలో నిరుపేదలకు, ధనస్వాములకు ఒక వైరుధ్యం ఏర్పడుతున్నది. ఈ అంతరాలను తొలగించడానికి మనం గ్రామీణ నిరుపేదల పక్షాన నిలవాలి. వారిని సంఘటిత పరిచి ముందుకు నడిపించాలి. అందుకుగాను కేంద్రం ఉపాధి బడ్జెట్‌ను రూ 2.5 లక్షల కోట్లకు పెంచేలా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి. అలాగే ఏడాదికి 200 పనిదినాలు కల్పించేలా, కనీస వేతనం రూ.600గా నిర్ణయించేలా పోరాటాలు చేయాలి. అప్పుడు మాత్రమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకోగలం. ఇది నేటి ఆవశ్యకత.

## కోట్లల్లో మరణాలు.. ఇంకా యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు ..!




**అమరావతి, తెలంగాణ దిశ:**దేశంలో గత 14 సంవత్సరాల్లో సుమారు 11.7 కోట్ల మంది మరణించినప్పటికీ ఆధార్ కార్డులను జారీ చేసే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ మాత్రం కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసిందని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వెల్లడయిం ది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే చాలా తక్కువ..! అయితే దీని వల్ల ఆధార్ నంబర్లు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 14 ఏళ్లలో తక్కువ డీయాక్టివేట్లు ..!:2025 జూన్ నాటికి భారతదేశంలో 142.39 కోట్ల ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇక ఐక్యరాజ్యసమితి జనాభా లెక్కల ప్రకారం . ఏప్రిల్ 2025 నాటికి దేశ మొత్తం జనాభా 146.39 కోట్లుగా ఉంది. అయితే, 2007-2019 మధ్య ఏడాదికి సగటున 83.5 లక్షల మరణాలు నమోదయ్యాయి. ఈ లెక్కన గత 14 సంవత్సరాల్లో 11.69 కోట్ల మంది మరణించి ఉండొచ్చు. అయినప్పటికీ ఉడారు ఈ 14 ఏళ్లలో కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే మరణాల ఆధారంగా డీయాక్టివేట్ చేసింది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే 10 శాతం మాత్రంగానే ఉంది. అయితే, ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని సమాచార హక్కు చట్టం ద్వారా ఉడాయ్ వెల్లడించింది. 2024 డిసెంబర్ 31 నాటికి మరణాల ఆధారంగా మొత్తం 1.15 కోట్ల


## ఉద్యోగాల పేరిట.. కుచ్చుటోపి!

**ఆదిలాబాద్, తెలంగాణ దిశ:**ఆదిలాబాద్ పట్టణం రాంనగర్ కాలనీ సమీపంలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారని ఆరోపిస్తు బాధితులు ఆందోళన చేపట్టారు. డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి యూనిఫామ్ వంకతో సుమారు 400 మంది నుండి 20 వేలు చొప్పున వసూలు చేశారన్నారు. ఉద్యోగం కోసం ఒక్కొక్కరి నుంచి సుమారు లక్ష వరకు వసూలు చేశారని ఆరోపించారు.. తీరా చూస్తే రెండు రోజుల నుండి ఆఫీస్ ఓపెన్ చేయకపోవడంతో పాటు ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు బాధితులు.. అటు ఉట్నూర్ లోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది.. ఉద్యోగాల పేరుతో మైక్రో ఫైనాన్స్ సంస్థ తమను మోసం చేసిందని బాధితులు ఆందోళన చేపట్టారు..

## ఆచి తూచి అడుగులు వేసినా..!

**తిరుపతి:, తెలంగాణ దిశ:**జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2014 లో పార్టీ పెట్టినా పార్టీని విస్తరించకపోవడానికి కారణం ప్రధానమైనది నేతలు పార్టీని ఇబ్బందిపెడతారనే. అందుకే ఆయన అన్ని నియోజకవర్గాల్లో ఇబ్బడి ముబ్బడిగా నేతలకు ఇన్ ఛార్జి పదవి ఇచ్చేసి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నించలేదు. పార్టీ బలపడకపోయినా పరవాలేదు కానీ, నేతల వల్ల పార్టీకి, తనకు వ్యక్తిగతంగా చెడ్డపేరు రాకూడదనే గత పదేళ్ల నుంచి ఆయన ఆచితూచి నేతల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నారు. తనకు నమ్మకమైన నేతలను మాత్రమే నియమించారు. అదీ తనకు సంబంధించిన వారు, దగ్గరగా ఉన్న వారు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పదవులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పెట్టి పదేళ్లవుతున్నా జనసేన బలోపేతం పై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టడం లేదని, కనీసం ఇన్ ఛార్జులను కూడా నియమించడం లేదని, పదవులను అప్పగించడం లేదన్న విమర్శలను ఆయనపెద్దగా పట్టించుకోరు. లైట్ గానే తీసుకుంటారు. పార్టీ పదవి ఇచ్చిన తర్వాత నేతలు తనకు తెలియకుండా ఏదైనాఅవినీతి ఆరోపణ లను ఎదుర్కొన్నా, మరేదైనా కేసులో ఇరుక్కుంటే తన పరువు ప్రజల్లో దెబ్బతింటుందని, అందుకే తక్కువ స్థానాల్లో పోటీ చేసి అయినా పూర్తి స్థాయి విజయం సాధించి అధికారంలోకి రావాలని ఆయన తొలి నుంచి ఆలోచనలో ఉన్నారు. అందులో భాగంగానే గత ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా పొత్తును ప్రకటించి కేవలం 21 నియోజకవర్గాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించారు. అప్పుడు కూడా ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. 21 స్థానాలను తీసుకోవడమేంటని, జనసేన కారణంగానే కూటమి ఏర్పడిందని, అందువల్ల ఎక్కువ స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ పై పలువురు కామెంట్స్ చేసినా ఆయన పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు తక్కువగా ఉంటే వారిపై నిఘా పెట్టడంతో పాటు వారి పనితీరును ఎప్పటికప్పుడు గమనించవచ్చని, ఎక్కువ సంఖ్య అయ్యే కొద్దీ సమాచారం తెప్పించుకోవడం కూడా కష్టంగా మారుతుందని, టీడీపీ, వైసీపీలకు పోటీగా జనసేన కూడా తయారవ్వడం మినహా మరొకటి ఉండదని పవన్ కల్యాణ్ చంద్రబాబుపై పెద్దగా ఒత్తిడి తేకుండానే తనకు ఇచ్చిన సీట్లతోనే సరిపుచ్చుకుని వాటన్నింటిలో అభ్యర్థులను గెలిపించుకున్నారు- ఇక ఎమ్మెల్యేల సంగతి అలా ఉంచితే పార్టీ ఇన్ ఛార్జుల విషయంలోనూ చాలా ఆచితూచి వ్యవహరిం చేవారు. అలాంటిది శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి కోటా వినుత విషయంలో తప్పుడు సమాచారం అందించారని కొందరు నేతలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వినుత హత్య కేసులో ఇరుక్కుని పార్టీ పరువును దిగజార్చారని, వైసీపీకి విమర్శించడానికి అవకాశాలు కల్పించినట్లయి ఒదని కూడా పవన్ కల్యాణ్ నేతలపై మండి పడినట్లు తెలిసింది. ఇటువంటి వారికి పదవులు ఇచ్చి తప్పు చేశామని కూడా పవన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ట్రాక్ రికార్డు చూసి మరీ ఇచ్చేందుకు మరింతగా అధ్యయనం చేయాలని నేతలకు సూచించినట్లు తెలిసింది.

## ఓటమిపై చర్చలెప్పుడు?




**ఒంగోలు, తెలంగాణ దిశ::** వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే? జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు. పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.. వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటు న్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నార. కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో రావద్దు : రోహిణి కోర్టు



షర్టు, నల్ల ప్యాంటుతో రాకూడదు అని ఢిల్లీలోని రోహిణి కోర్టు బార్ అసోసియేషన్ నిషేదాజ్ఞలు విధించింది. కొందరు న్యాయవాదుల్లాగా తెల్ల షర్టు,నల్ల ప్యాంటులతో వచ్చి మోసాలకు పాల్పడుతున్నట్లు కోర్టు గుర్తించింది. దీంతో న్యాయవాదులు తప్ప ఎవ్వరూ తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో కోర్టు పరిసరాల్లోకి రావద్దు అని నోటీసు జారీ చేసింది. కొంతమంది మధ్యవర్తులు తమను తాము న్యాయవాదులు లేదా వారి గుమస్తాలుగా చెప్పుకుంటూ. మోసాలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని కోర్టు తెలిపింది. దీంతో గుమస్తాలు, వ్యాజ్యాలు దాఖలు చేసేవారు, సాధారణ ప్రజలు ఎవరూ తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించకూ డదని పేర్కొంది. అందుకే కోర్టు పరిసరాల్లోకి న్యాయవాదులు మాత్రమే అలాంటి దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేసింది.

## ప్రైవేట్ జెట్‌ను కొన్న జొమాటో సిఈఒ




బిజినెస్ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సిఈఒ దీపిందర్ గోయల్ పౌర విమానయాన రంగంలోకి అడుగుపెట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే 'ఎల్ఏటీ ఏరోస్పేస్' పేరుతో ఏవియేషన్ వెంచర్‌ను ప్రారంభించిన ఆయన.. తాజాగా ఓ ప్రైవేటు జెట్ ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేటు జెట్‌ను ఎల్ఏటీ ఏరోస్పేస్ కొనుగోలు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బాంబర్డియర్ విమానం ఈ ఏడాది జూన్ నుంచి న్యూఢిల్లీ ఎయిర్‌పోర్టులోని వీఐపీ బే వద్ద కనిపిస్తుంది. దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆ కథనాల సమాచారం. ఈ విమానం నిర్వహణ, ఇంజినీరింగ్ బాధ్యతలను ఇందమెర్ ఎంజెట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, బర్డ్ ఎగ్జిక్యూజెట్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ కంపెనీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రైవేట్ జెట్ మోడల్, ఇతర ఫీచర్స్ గురించి ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది.

దీపిందర్ గోయల్ ఇటీవలే ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి విదితమే. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్‌లో గల ఈ అపార్ట్‌మెంట్‌ను ఏకంగా రూ.52.3 కోట్లకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దీపిందర్ గోయల్‌కు జొమాటోలో 3.83 శాతం వాటాలున్నాయి.

# త్రాగు నీటి సరఫరా పనులను వెంటనే పూర్తి చేయాలి

### – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపలి, తెలంగాణ దిశ:** పెండింగ్ త్రాగు నీటి సరఫరా పనులను యుద్ధ ప్రాతిప దికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీ కృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష త్రాగు నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహిం చారు. గుం జపడుగు, పుట్టపాక, కమాన్ పూర్, గుండారం, నాగారం, పెంచికల్ పేట, రామగిరి , మస్యాల, బేగంపేట , రత్నా పూర్, కల్వచర్ల, పెద్దరాజ్ పల్లి, ఓదెల , గొల్లపల్లి ప్రాంతంలో పెండింగ్ మిషన్ భగీరథ ఇంట్రా పనుల పురోగతి పై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెండింగ్ మిషన్ భగీరథ ఇంట్రా త్రాగునీటి సరఫరా చిన్న చిన్న పనులను ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టర్ లను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ పనులు చేయాలని, క్షేత్ర స్థాయిలో పనులు పూర్తి చేసేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. జిల్లాలో అవసరమైన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ నిబంధన ప్రకారం పూర్తి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వాటర్ ట్యాంకర్ మరమ్మత్తులు, ల్యాడర్స్ నిర్మాణానికి 92 లక్షల మంజూరు చేయడం జరిగిందని, జిపి నుంచి తీర్మానం తీసుకుని ఆ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మన జిల్లాలో రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి ఇన్ ఫ్రా పనులు ఉండకుండా త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో త్రాగునీటి సరఫరా నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. వానా కాలంలో నీటి లీకేజీలకు త్వరగా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించాలని, నీటి నాణ్యతలు ఎటువంటి ఇబ్బందులు రావడానికి వీలు లేదని అన్నారు. జిల్లాలో ఎక్కడ కలుషిత త్రాగునీరు వస్తుంది, నీటి లీకేజీ జరుగుతుందనే మాట వినపడడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ మున్సిపల్ డెవలప్మెంట్ వర్క్ పై అడిషనల్ కలెక్టర్ సందర్శన




**తొర్రూరు, తెలంగాణ దిశ:** తొరూర్ మున్సిపాలిటీ డెవలప్మెంట్ వర్క్స్ పై స్పెషల్ ఆఫీసర్ అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో అన్నారం రోడ్డు సమతా కాలేజీ రోడ్డును, డిపో మెయిన్ రోడ్డును, సందర్శించిన అనంతరం తొర్రూర్ మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు, 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా, ప్లాస్టిక్ నివారణ,ఎల్ఆర్ఎస్ హౌస్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ పై తుర్రు కమిషనర్ శ్యాంసుందర్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో మాట్లాడుతూ 15 కోట్లరూపాయలతో డెవలప్మెంట్ చేయాలని ప్రపోజల్స్ రాగా మున్సిపాలిటీ సందర్శించడం జరిగిందని అన్నారు. అలాగే 100 రోజుల యాక్షన్ ప్లాన్ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,టాక్స్ కలెక్షన్ పై కమిషనర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు, ప్లాస్టిక్ పై సమరం సాగించాలని ప్లాస్టిక్ను పూర్తిగా నివారించేలా మున్సిపాలిటీలో తగు చర్యలు తీసుకునేలా కమిషనర్ కు సూచనలు జారీ చేశారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్,డి ఈ ఏ ఈ రంజిత్ కుమార్, ఇన్చార్జ్ మేనేజర్ కట్టస్వామి,వార్డ్ ఆఫీసర్లు,సానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ట్రాన్స్పోర్ట్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు..

# 5 సంవత్సరాల కఠిన కారగారా జైలు శిక్ష

### ఒక్కొక్కరికి 10,000 రూపాయల జరిమానా

**గోదావరిఖని, తెలంగాణ దిశ:** గోదావరిఖని వన్ టౌన్ పరిధిలో ఎంజాయ్ తరలిస్తున్న ఇద్దరికీ 1. ప్రసన్ జిత్ రాయ్, 2. కమలేష్ గోల్డర్ ఇన్స్పెక్టర్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ 2017 వ సంవత్సరంలో ఆర్టీసీ బస్ స్టాండ్ గోదావరిఖని లో పెట్రోలింగ్ చేయుచుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న పై ఇద్దరూ వ్యక్తులను ఆపి వారి వద్ద ఉన్న బ్యాగ్ లను చెక్ చేయగా ఒక్కొక్కొరీ వద్ద 5కేజీ ల గంజాయి మొత్తం 10 కేజీ లు దొరికింది, వీరు ఒరిస్సా లో గుర్తు తెలియని వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినారు, అప్పటి ఇన్స్పెక్టర్ జి. కృష్ణ ఫ్ ఐ ర్ చేసి కేసును పరిశోధన ప్రారంభించి విచారణ చేసి నేరస్తులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించడం జరిగింది, తదుపరి నేర పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయడం జరిగింది. జిల్లా జడ్జి కోర్టు పెద్దపల్లి కోర్టులో కేసు విచారణ జరిగింది. . కె . సునీత జడ్జి ఇరువురి వాదనలు విని తదనంతరం నేరస్తులు నేరం చేసినట్లు ఋజువుకావడ%శీ% వలన వారికి 05 సంవత్సరాల కాలం కఠిన కారగారా జైలు శిక్ష మరియు ఒక్కొక్కరికి 10,000/- రూపాయల జరిమానా విధించారు. నేరస్తునికి శిక్ష పడడానికి ముఖ్యపాత్ర వహించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్: . బాదం రమేష్ సాక్షులను ప్రవేశపెట్టి తన వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. పెద్దపల్లి డిసిపి. పి. కరుణాకర్ గమరియు యం. రమేష్ ఏసీపీ గోదావరిఖని పర్యవేక్షణ లో సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన ఇన్స్పెక్టర్ .కోర్ట్ కానిస్టేబుల్. అరుగొండ. సతీశ్ కుమార్ పి సి 754, సి ఎం స్: పి.కోటేశ్వర రావు హెచ్ సి 2465 లను రామగుండం అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్., ప్రాసిక్యూషన్ బృందానికి అభినందనలు తెలిపారు.

# అటకెక్కిన వివేకా కేసు



కడప, తెలంగాణ దిశ:వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏం జరుగుతోంది? ఎటువంటి పురోగతి లేదు ఎందుకు? ఇంకా ఈ కేసు కొలిక్కి తేవాలంటే సిబిఐ కి ఎన్ని రోజులు పడుతుంది? తెర వెనుక ఏం జరుగుతోంది? రాజకీయ కోణంలోనే జాప్యం జరుగుతోందా? లేకుంటే పరోక్ష శక్తులు ఆటంకాలు చేస్తున్నాయా? ఇప్పుడు అన్ని వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. నిన్ననే సుప్రీంకోర్టులో అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పై విచారణ జరిగింది. ఆ సమయంలో సుప్రీంకోర్టు మూడు అంశాలను తెరపైకి తెచ్చింది. అసలు సిబిఐ ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందా? అనే ప్రశ్న వేసింది. ఈ కేసు విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియడంతో ఈ ప్రశ్న వేసింది.అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం సహకరించలేదన్నది అప్పట్లో వచ్చిన ఆరోపణ. తిరిగి దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారులను భయపెట్టే పరిస్థితులు ఉండేవని అప్పట్లో టిడిపి అనుకూల మీడియా వార్తలు ప్రచురించింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. కానీ కనీస స్థాయిలో వివేకానంద రెడ్డి హత్య కేసు ముందుకు సాగడం లేదు. దీనిని ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారా? లేకుంటే 2029 ఎన్నికల సమయానికి మరింత బిగుసుకునేలా కేసు తెరపైకి తేనున్నారా అన్న అనుమానాలు అయితే కలుగుతున్నాయి. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి.2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అయితే అప్పుడు టిడిపి అధికారంలో ఉంది. సిఐడి విచారణకు ఆదేశించింది చంద్రబాబు సర్కార్. అయితే సిఐడి కాదని.. సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్మోహన్ రెడ్డి. దీంతో సిబిఐ విచారణ ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి హత్య అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రయోజనం చేకూర్చింది. సానుభూతి వర్కౌట్ అయింది. జగన్ అధికారంలోకి వచ్చారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని తేల్చి చెప్పారు. దీంతో వివేక కుమార్తె సునీత రంగంలోకి దిగారు. న్యాయ పోరాటం చేయడంతో సిబిఐ విచారణ కొనసాగింది. అయితే ఏపీ ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ, నిందితుల నుంచి దర్యాప్తు అధికారులకు బెదిరింపులు వంటివి చోటు చేసుకున్నాయి. దీంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా వివేకానంద రెడ్డి హత్య కేసును దర్యాప్తు చేయిస్తామని.. నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఈ కేసు విచారణలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు.ప్రస్తుతం వివేకానంద రెడ్డి కుమార్తె సునీత గట్టిగానే పోరాటం చేస్తున్నారు. తన తండ్రిని చంపిన నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు హోంమంత్రి అనిత తో పాటు బిజెపిని కూడా కలిశారు. కానీ ఆ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి చర్యలు ప్రారంభం కాలేదు. దీంతో వివేకానంద రెడ్డి హత్య కేసు వెనుక ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అయితే తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని.. అదును చూసి కూటమి ప్రభుత్వం దెబ్బ కొడుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆ పని ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

# ఇంటినెంబర్లతో రిజిస్ట్రేషన్స్..

**కరీంనగర్, తెలంగాణ దిశ:**కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. అక్రమ రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి, పారదర్శకతను పెంచడానికి ఇంటి కొలతలు, విస్తీర్ణం, ఎన్వోసీ వంటి నిబంధనలు తప్పనిసరి చేశారు. ఈ నిర్ణయంతో గ్రామాల్లో క్రయవిక్రయదారులకు ఊరట లభించింది. అయితే, పురపాలికలు, నగరపాలికల్లో, ముఖ్యంగా కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండితో పాటు కొత్తపల్లి, రేకుర్తిలో ని 200 సర్వే నంబర్లలో ఇంకా రిజిస్ట్రేషన్లపై స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామాల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబా టును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులు ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతోపాటు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లకు చేరాయి. ఇళ్ల క్రయవిక్రయాలు జరిపే క్రమంలో రిజిస్ట్రేషన్ల సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విక్రయించే ఇంటిని పరిశీలించి, ఇంటి విస్తీర్ణం కొలతలు, నాలుగు వైపులా ఉన్న వారి వివరాలు, స్లాబ్ ఏరియాతో పాటు సంబంధిత డాక్యుమెంట్లతో కూడిన ఎన్వోసీ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యలు అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసి, పారదర్శకతను పెంచేందుకు ఉద్దేశించినవి అన్నారు.కాగా, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిన అధికారులు, పురపాలికలు, నగరపాలికల్లో మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కరీంనగర్ నగరపాలిక, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు సంబంధించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, రేకుర్తిలోని దాదాపు 200 సర్వే నంబర్లలో భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ నిషేధంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆస్తులను క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో తీసుకున్న సానుకూల నిర్ణయం పురపాలికలు, నగరపాలికలకు కూడా వర్తింపజేయాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇక గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సారంగాపూర్, రాయికల్ మండలాల్లో అత్యధిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవుల మధ్య నుంచే పలు రహదారులు వెళ్తాయి. గతంలో ప్రభుత్వం ఈ గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టినా, అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కొంతకాలంగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ, ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడం లేదు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరగా అనుమతులు మంజూరు చేసి, నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

# హద్దుమీరుతున్న నేతల రాజకీయ భాష!

రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటుతోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడుతున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన బిఆర్ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తు న్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా, సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయం లో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడతారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కులమైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యాగాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకుడు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలి స్టులను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాదిన్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్చనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగప్సాకరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ సొంత జాగీరుగా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికారంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజాధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుంబానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోంది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తులతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్ములా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు..ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియంత్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడిగడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళు విసరుతారు. నిజానికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమరావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉ ఒడడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించరాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణతో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.

# సినిమా..

## నవంబర్‌లో నారా వారింట పెళ్లి సందడి..



టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ హీరోల్లో నారా రోహిత్ ఒకరు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడి కుమారుడిగా సినీ ఇండస్ట్రీకి పరిచయమైన రోహిత్, కెరీర్ ప్రారంభంలోనే బాణం, ప్రతినిధి వంటి సినిమాలతో సీరియస్ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కొన్ని వరుస ఫ్లాపులతో అతని కెరీర్ కాస్త డౌన్ అయ్యింది. దీంతో కొన్నేళ్లు గ్యాప్ తీసుకుని వెయిట్ లుక్ లో భారీ మార్పులు చేసుకున్నారు. రోహిత్, తాజాగా 'సుందరకాండ' అనే సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు రాగా, పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన ఈ సినిమా, రోహిత్‌కి మంచి బూస్టప్‌ని అందించింది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందిన ఈ చిత్రం మంచి రెస్పాన్స్‌ను రాబట్టడంతో, రోహిత్ ప్రమోషన్స్‌లో ఫుల్ జోష్‌తో పాల్గొంటున్నారు. తాజాగా గుంటూరులో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొన్న రోహిత్, అక్కడ గణేశుడిని దర్శించుకుని అభిమానులతో, మీడియాతో మాట్లాడారు. "ఇంత కాలం తర్వాత ఆడియెన్స్ నుంచి ఇలా స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు నమ్మకాన్ని కలిగిస్తోంది," అని చెప్పారు. ఈ సందర్భంగా రోహిత్ తన పెళ్లి గురించి కూడా ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ మొదటి వారంలో నా పెళ్లి జరుగుతుంది అని అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే 'ప్రతినిధి 2' సినిమాలో హీరోయిన్‌గా నటించిన శిరీష (సిరి) తో రోహిత్‌కి నిశ్చితార్థం జరిగింది. అయితే, ఎప్పుడో వీరి వివాహం జరగాల్సి ఉండగా, రోహిత్ తండ్రి ఆకస్మికంగా మృతిచెందడంతో ఈ వేడుక వాయిదా పడింది. ఇప్పుడు మళ్లీ కొత్త షెడ్యూల్‌ను ఫిక్స్ చేశారని తెలుస్తోంది. సుందరకాండ తర్వాత తన తదుపరి సినిమాలు వేరే జోనర్స్, అన్ని వర్గాల ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ ఉంటాయని, త్వరలోనే వాటిపై అధికారిక ప్రకటన చేస్తానని కూడా రోహిత్ తెలిపారు. మొత్తానికి, "సుందరకాండ" సినిమా నారా రోహిత్ కెరీర్‌నే కాకుండా వ్యక్తిగత జీవితాన్నీ కొత్త దిశగా తీసుకెళ్తోంది.

## నా కొడుకు వేరే కాపురం పెట్టాడు..

### చాలా మిస్ అవుతున్నానంటూ హీరో తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు



హీరో నాగ శౌర్య వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులని ఎంతగానో అలరించాడు. చివరిసారిగా 2023లో విడుదలైన రంగబలి సినిమాలో వెండితెరపై కనిపించారు. ఆ తరువాత కొంత గ్యాప్ తీసుకున్నారు. అయితే, ప్రస్తుతం ఆయన చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. త్వరలోనే వీటితో తిరిగి ప్రేక్షకులను పలకరించబోతున్నారు. పోలీస్ వారి హెచ్చరిక, బాయ్ బాయ్ కార్తీక్, నారీ నారీ నడుమ మురారీ అనే సినిమాల్లో నటిస్తున్నారు నాగ శౌర్య. ఈ సినిమాలు ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి. వృత్తి పరంగా బిజీగా ఉన్న నాగశౌర్య తాజాగా వ్యక్తిగత జీవితంలోని ఆసక్తికర పరిణామాలతో వార్తల్లో నిలిచారు. 2022 నవంబర్‌లో బెంగళూరుకు చెందిన అనుషా శెట్టిని వివాహం చేసుకున్న నాగ శౌర్య, కొద్దికాలంలోనే తండ్రయ్యారు. గత ఏడాదే ఈ దంపతులకు ఓ పాప పుట్టింది. నవంబర్‌లో ఆమె మొదటి పుట్టిన రోజు కూడా గ్రాండ్‌గా జరిపినట్లు తెలుస్తోంది. అయితే, పెళ్లయ్యాక తల్లి తండ్రులతో కాకుండా వేరే ఇంట్లో కాపురం పెట్టారని నాగ శౌర్య తల్లి ఉషా ముల్పురి ఓ ఇంటర్వ్యూలో చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.నాగ శౌర్య చిన్నప్పుడే, పెళ్లయ్యాక కలిసుండను అని చెప్పేవాడు. 'ఇద్దరు మంచివాళ్లు ఒకేచోట ఉండకూడదు' అనే నమ్మకం అతనిదని అన్నారు. అందుకే ఇప్పుడు శౌర్య, అనుషా వేరే ఇంట్లో ఉంటున్నారు," అని చెప్పారు ఉషా. తన కొడుకు, కోడలు వేరుగా ఉండటం తనకు ఎంతగానో బాధ కలిగిస్తోందని ఎమోషనల్‌గా చెప్పారు ఉషా. నాకు ఇద్దరు కొడుకులు.. చిన్నప్పుడు వాళ్లిద్దరికీ ఆస్తమా ఉండేది.

అందుకే స్కూలుకు పంపించకుండా ఇంట్లోనే చదివించేదాన్ని. రోజంతా వాళ్లతో గడిపేదాన్ని. ఇప్పుడు వాళ్లిద్దరూ పెళ్లి చేసుకుని వేరుగా ఉండిపోవడంతో ఇల్లు బోసిపోయినట్లు అనిపిస్తోంది," అంటూ భావోద్వేగానికి లోనయ్యారు.తన వ్యక్తిగత వ్యధను పంచుకున్న ఉషా ముల్పురి, ప్రస్తుతం ఫిల్మ్ ప్రొడక్షన్‌తో పాటు రెస్టారెంట్ బిజినెస్‌లోనూ చురుకుగా కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లో ఆమెకు పలు రెస్టారెంట్లు కూడా ఉన్నాయి. ఇక ప్రస్తుతం తన కొత్త సినిమాల షూటింగ్‌లతో బిజీగా ఉన్న నాగ శౌర్య, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరించనున్నారు. సక్సెస్‌ఫుల్ కమ్‌బ్యాక్ ఇవ్వాలనే పట్టుదలతో ముందుకెళ్తున్న ఈ యంగ్ హీరోని అభిమానులు కూడా చాలానే మిస్ అవుతున్నారు.

## ఎన్టీఆర్ డ్రాగన్‌లో రుక్మిణీ..



తాజాగా ఈ విషయాన్ని మదరాసి చిత్ర నిర్మాత ఎన్వీ ప్రసాద్ కన్ఫాం చేశారు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఎన్వీ ప్రసాద్ ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ చిత్రానికి ఆమె రూ. 1.5 కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటోందన్న టాక్ ఫిలింనగర్‌లో గట్టిగా వినిపిస్తోంది. ఆమె యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉండడం, ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతుండడంతో, ఆమె అడిగినంత రెమ్యునరేషన్‌కు మేకర్స్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. కాగా, తమిళ స్టార్ శివకార్తికేయన్ సరసన 'మదరాసి' అనే చిత్రంలో నటించిన రుక్మిణీ, కాంతార 2 చిత్రంలో కూడా నటిస్తుంది. అలానే టాక్సిక్‌లోను ఈ ముద్దుగుమ్మ కథానాయికగా నటిస్తుంది. చూస్తుంటే రానున్న రోజులలో ఈ ముద్దుగుమ్మ హవా ఓ రేంజ్‌లో ఉండనుందని అర్ధమవుతుంది.

ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో కన్నడ భామల హవా స్పష్టంగా కనిపిస్తోంది. రష్మిక మందానా బ్లాక్‌బస్టర్లతో దూసుకుపోతుంటే, నభా నటేష్, శ్రద్ధా శ్రీనాథ్ లాంటి యాక్ట్రెస్‌లు కాస్త వెనకబడ్డారు. ఇక ఆషిక రంగనాథ్‌కు తెలుగులో అవకాశాలు వచ్చిన హిట్ దక్కించుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె ఆశలన్నీ 'విశ్వంభర' మీదే ఉన్నాయి. ఇక ఈ పోటీలో మరో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ చేరింది. 2019లో 'బీర్బల్' సినిమాతో కన్నడలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీకి నిజమైన గుర్తింపు మాత్రం 2023లో వచ్చిన క్లాసిక్ లవ్‌స్టోరి 'సప్త సాగరాలు దాటి' తో వచ్చింది. ఇందులో ఆమె నటన, ఎమోషనల్ స్క్రీన్ ప్రెజెన్స్, క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంది. ఈ చిత్రం ఆమె కెరీర్‌ను పూర్తిగా మలిచేసింది. ఈ సినిమా నాకు రెండో జీవితాన్ని ఇచ్చింది. ఒక దశలో నటిగా నేను సెట్ అవుతానా లేదా అనే డైలమాలో ఉన్నాను. కానీ 'సప్త సాగరాలు దాటి' వల్ల నా జీవితం మారిపోయింది," అని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో చెప్పింది.రుక్మిణీ వసంత్ తెలుగులో నిఖిల్ సరసన నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైంది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయింది. అయినప్పటికీ, రుక్మిణీకి అవకాశాలు మాత్రం తగ్గలేదు.ఈ బ్యూటీ ఇప్పుడు ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ మూవీ 'డ్రాగన్' లో హీరోయిన్‌గా నటిస్తోంది. కొద్ది రోజులుగా ఈ విషయంకి సంబంధించి ప్రచారాలు జరుగుతుండగా,

## థియేటర్లు కళకళలాడేనా?



గతేడాది లాగానే ఈ ఏడాది కూడా పెద్ద సినిమాలు సందడి తక్కువగా ఉంది. భారీ బడ్జెట్లు..పెద్ద హీరోల సినిమాలు చాలా తక్కువగానే వచ్చాయి. సంక్రాంతికి వచ్చిన సినిమాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఫ్యామిలీ ఆడియన్సును బాగా ఆకట్టుకుంది. క్లాస్, మాస్ ప్రేక్షకులు 'డాకు మహారాజ్'ను ఆదరించారు. గేమ్‌ఛేంజర్ బాక్సాఫీసు వద్ద బోల్తాకొట్టింది. ఆ తర్వాత వచ్చిన 'తండేల్' రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. 'హిట్' సిరీస్‌లో హిట్ 3 కూడా ఆకట్టుకుంది. పవన్‌కళ్యాణ్ సినిమా 'హరి హర వీరమల్లు'లో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆగస్టులో తారక్, హృతిక్‌రోషన్ నటించిన వార్ 2, రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఇప్పటివరకూ చూస్తే మొత్తంగా ఐదారు సినిమాలకు మినహా మిగతా కాలమంతా థియేటర్లు వెలవెలబోయాయి. టాలీవుడ్‌లో ఆగస్టు 4 నుంచి 21 వరకూ వేతన ఒప్పందం కోసం కార్మికులు బంద్ పాటించిన విషయం తెలిసిందే. 19 రోజుల పోరాటానికి 30 శాతానికిగాను 22.5 శాతం అగ్రిమెంట్‌ను పొందారు. 22 నుంచి షూటింగ్‌లు యధాతథంగా కొనసాగుతున్నాయి. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న సినిమాలను రాబోయే దసరా, దీపావళి, క్రిస్మస్, వచ్చే సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని శరవేగంగా పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నారు. కార్మికులు కూడా వేతనాలు పెరిగిన సంతోషంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. దేశంలో మొత్తం మొత్తం 6,877 థియేటర్లు ఉండగా ఆంధ్రాలో అత్యధికంగా 1097, తమిళనాడులో 943, కర్నాటకలో 719, మహారాష్ట్రలో 703, తెలంగాణాలో 485 థియేటర్లు ఉన్నాయి. హిందీ తర్వాత తెలుగు సినిమాలే ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నాయి. తెలుగు తర్వాత తమిళనాడు చిత్ర పరిశ్రమ ఉంది. పాన్ ఇండియా తరహాలో సినిమాలు తీస్తుండటంతో అవి ఎక్కడైనా థియేటర్లలో విడుదల చేసుకునే అవకాశాలున్నాయి. అందుకే అనేక భాషా సినిమాలను డబ్బింగ్ చేసి ప్రాంతీయ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇలా చూస్తే గతేడాది చాలావరకూ డబ్బింగ్ సినిమాలు తెలుగులో విరివిగా వచ్చాయి.

**పవన్ కోసం బాలయ్య త్యాగం:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). పవన్ రాజకీయంగా బిజీగా ఉండడంతో ఈ సినిమా చిత్రీకరణ కూడా వాయిదా పడుతూ వచ్చి ఇటీవలే ముగిసింది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. పవన్‌కు జోడీగా ప్రియాంకా మోహన్ నటించారు. ప్రతినాయకుడిగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కనపడనున్నారు. దసరా కానుకగా ఈ చిత్రం ఈనెల 25న విడుదల కానుంది. ఈమేరకు 'ఫైరింగ్ వరల్డ్ 25 సెప్టెంబరు 25' అంటూ చిత్ర యూనిట్ ఓ పోస్టర్ విడుదల చేసింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్, సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. పవన్ నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ఫ్లాప్ మూవీగా నిలిచింది. దసరాకు పవన్ 'ఓజీ', బాలకృష్ణ 'అఖండ–2' సినిమాలు మొదట్లో పోటీ పడ్డాయి. ఆ తర్వాత బాలకృష్ణ సినిమాను వాయిదా వేస్తూ చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. మరింత విఎఫ్ఎక్స్, రీ రికార్డింగ్ మెరుగులు దిద్దేందుకే మరింత సమయం అవసరమని పేర్కొన్నా పవన్ కోసమే ఇలా చేశారనేది ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 'హరిహర వీరమల్లు' సినిమాతో డిజాస్టర్‌ను ఎదుర్కొన్న పవన్ 'ఓజీ'పైనే ఆశలు పెంచుకున్నారు. బాలకృష్ణ–బోయపాటి కాంబోలో వచ్చిన 'అఖండ' 2021లో బాక్సాఫీసును షేక్ చేసింది. ఈ మూవీకి సీక్వెల్‌గా అఖండ–2ను తెరకెక్కించటంతో భారీగా అంచనాలున్నాయి. అందుకే పవన్ కోరిక మేరకు బాలకృష్ణ సినిమాను చిత్ర యూనిట్ వాయిదా వేసిందనే ఊహాగానాలు వస్తున్నాయి. 'ఓజీ', 'అఖండ 2' సినిమాలు ఒకే రోజు విడుదల అవుతాయని మొదట్లో ఆయా చిత్రాల నిర్మాతలు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా 'అఖండ–2' వాయిదాతో 'ఓజీ' చిత్ర యూనిట్ సంతోషంగా ఉంది. అఖండ– 2 చిత్రాన్ని బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని, 14 రీల్స్ ఎంటర్ టైన్‌మెంట్స్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణకు జోడీగా సంయుక్త నటించారు.

**వీఎఫ్ఎక్స్ వర్క్సులో పెద్ద సినిమాలు:** అగ్రతారల సినిమాలు విడుదలయ్యాయంటే ఒకట్రెండు వారాలపాటు బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగుతోంది. ఆ తర్వాత కానీ కొత్త సినిమాలు విడుదలకు ముందుకు రావు. బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో చిరంజీవి నటించిన 'విశ్వంభర' చిత్రం వచ్చే సంక్రాంతికి వస్తుందని భావించినా వేసవిలో ఏప్రిల్‌కి వాయిదా పడింది. 2.30 గంటల సినిమాలో సుమారు రెండు గంటల వరకూ గ్రాఫిక్స్ ఉంటాయని సమాచారం. చిరంజీవి కథా నాయకుడిగా సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేర్గాంచిన అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్' (పండక్కి వస్తున్నాడు–సబ్‌టైటిల్) సినిమా వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది. అఖండ –2 సినిమా సంక్రాంతి బరిలో నిలిచే అవకాశం ఉంది. విఎఫ్ఎక్స్, రీ రికార్డింగ్ పనులతోపాటుగా మొత్తం పోస్ట్ ప్రొడక్షన్స్ పనుల కోసమే ఈ సినిమాను వాయిదా వేసినట్లుగా నిర్మాతలు ప్రకటించారు. సంక్రాంతి బరిలో మొదటి నుంచి రేసులో ఉన్న సినిమా ప్రభాస్ నటించిన 'దిరాజాసాబ్'. ఈ ఫ్యాంటసీ హారర్ కామెడీ యాక్షన్ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ది కుమార్ కథానాయికలు. జనవరి 9న విడుదల చేస్తామని నిర్మాత టిజి విశ్వప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు. ఇంకా రవితేజ 'మాస్ జాతర', రామ్‌చరణ్ 'పెద్ది', పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాలు షూటింగ్‌లో ఉన్నాయి. తేజ సజ్జా 'మిరాయ్' రష్మికా మందన్నా 'గర్ల్‌ఫ్రెండ్', సినిమా ఈనెల ఐదో తేదీన విడుదల కానున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215